ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శనివారం 9 మార్చి 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 22.0



• పాలకొల్లు : క్షీరా రామలింగేశ్వరుడు



• భీమవరం : సోమేశ్వరుడు



• వీరంపాలెం : మహా శివలింగం



• పట్టిసీమ : వీరేశ్వరుడు



హరోంహర

హరహర మహాదేవ శంభో శంకరా.. ఓం నమఃశివాయ అంటూ భక్తుల నామస్మరణతో ప్రసిద్ధ శైవక్షేత్రాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినం శుక్రవారం తెల్లవారు జాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పంచారామ క్షేత్రాలైన పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరుడు, భీమవరం సోమేశ్వరుడు, పట్టిసీమ వీరేశ్వరుడు, వీరంపాలెం స్పటిక లింగం, బలివే రామలింగేశ్వరుడు, ఆచంట ఆచంటేశ్వరుడు, కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి తదితర శైవ క్షేత్రాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. లక్షలాది మంది భక్తులు ఆయా ఆలయాల్లో స్వామిని దర్శించుకున్నారు. 7లో..

సింగిల్ టెండర్లతో మాయాజాలం

» రూ.16 కోట్ల నిధులను పంచుకునేందుకు అధికార పార్టీ నాయకులు, కాంట్రాక్టర్ల కుమ్మక్కు
» నూజివీడులో పనుల పేరిట పచ్చని మామిడిచెట్ల తొలగింపు



అభివృద్ధి పనుల పేరుతో తొలగిస్తున్న పచ్చని మామిడి చెట్లు

నూజివీడు, మార్చి 8 : నూజివీడు పట్టణాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ మంజూరు చేసిన రూ.16 కోట్ల నిధులతో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనుల కాంట్రాక్టులు దక్కించుకునేందుకు కాంట్రా క్టర్లు సిండికేట్ అయ్యారు. సింగిల్ టెండర్ల ద్వారా కాంట్రాక్ట్‌లను దక్కించుకున్నారు. ఇటీవల నూజివీడు వచ్చిన సీఎం స్థానిక ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కోరిక మేరకు ఒక్కో వార్డుకు రూ.50 లక్షల చొప్పున ప్రతి సచివాలయం పరిధిలోని రెండు వార్డులకు కోటి రూపాయలు మంజూరు చేస్తూ నూజివీడులోని మొత్తం 16 సచి వాలయాలకు రూ.16 కోట్లను విడుదల చేశారు. ఇందుకు సంబంధించి అభివృద్ధి పనుల ను ఎమ్మెల్యే గడప గడపకు కార్యక్రమంలో భాగంగా గుర్తించి చేపట్టాల్సిందిగా సిఫార్సు చేయగా, ఇటు నూజివీడు మున్సిపల్ కార్యాలయంలోనూ పనుల గుర్తింపుపై విపక్ష కౌన్సిలర్లు తమ అభ్యంతరాలను తెలిపారు. అప్పటికే ప్రతిపాదనలు పంపడం జరిగిం దని, ఆ పనులకు త్వరలో టెండర్లు పిలుస్తామని మున్సిపల్ అధికారులు కౌన్సిల్ సమా వేశంలో చెప్పారు. ఇటీవల టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఒక్కో వార్డుకు రూ.50 లక్షల పనులకు సంబంధించి టెండర్లను ఐదునుంచి రూ.10 లక్షల వరకు విభజిస్తూ టెండర్లను పిలిచారు. ఈ టెండర్లను గుట్టుచప్పుడు కాకుండా అధికార పార్టీ నాయకులు, వారికి సంబంధించిన కాంట్రాక్ట్ దారులతో కుమ్మక్కై సిండికేట్‌గా సింగిల్ టెండర్లతో కాంట్రాక్ట్ లను దక్కించుకున్నారు. టెండర్ల దాఖలులో పేర్కొన్న టెండర్ మొత్తానికన్నా ఒక్క రూపాయి అదనంగా వేసినా టెండర్లు రద్దయ్యే పరిస్థితి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి టెండర్‌కు లెస్ అమౌంట్ వేసి టెండర్లను దక్కించుకోవడం గమనార్హం. పనులు చేపట్టి మధ్యస్తంగా ఉన్నప్పుడు నిధులు సరిపోలేదనే సాకు చూపుతూ నిధులు పెంచమని తిరిగి అభ్యర్థనలు పెడితే టెండర్‌ను మించి అదనంగా నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకునే అధికార పార్టీ నాయకుల సూచనలు అనుసరించే ఈ లెస్ టెండర్ల ప్రక్రియ సాగినట్టు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల కోడ్ సమీపిస్తున్న తరుణంలో ప్రతివార్డుకు రూ.50 లక్షలు నిధులు కేటా యించడంపై రాజకీయ కోణాలు దాగి ఉన్నాయని ప్రతిపక్షాల నాయకులు పేర్కొంటు న్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి పనులు మంజూరు కాగా తదనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో సంబంధిత పనులను నిలిపివేసింది. నాడు నూజివీడు ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత శాసన సభ్యుడు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అప్పటి టీడీపీ ఇన్‌చార్జ్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావుతో విభేదించి మరి శంకుస్థాపన లను శరవేగంగా నిర్వహించారు. అయితే తదనంతరం అధికారంలోకి వచ్చాక రాష్ట్రప్రభు త్వం రివర్స్ టెండరింగ్ పేరుతో ఆ పనులను నిలిపివేయగా, ఆ అభివృద్ధి పనులను తిరిగి గాడిలో పెట్టేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న ఎమ్మెల్యే ప్రతాప్ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. తిరిగి ఎన్నికల తరుణం సమీపించడంతో మళ్లీ టెండర్ల ఎన్నికల మాయాజాలానికి అధికార పార్టీ నాయకులు తెరతీశారు. టెండర్ల ప్రక్రియ పూర్తయి అవ్వకుండానే సంబంధిత రహదారుల అభివృద్ధి పేరుతో వేసవిలో నిబంధనలకు విరు ద్ధంగా పచ్చని చెట్లను తొలగిస్తుండడంపై పట్టణవాసులు విమర్శిస్తున్నారు. పట్టణంలో పార్కుల అభివృద్ధిని అధికార పార్టీ పక్కన పెట్టింది. ప్రతి బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించడమే తప్ప పార్కుల్లో పచ్చదనం కానరావడం లేదు. ఇటు సహజసిద్ధంగా గత తరాలు నాటిన మామిడి చెట్లను సైతం కాయలతో ఉన్న సమయంలోనే టెండర్ల పేరుతో వేసవిలో తొలగించడంపై పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉమ్మడిగా గెలవాలి

రాజకీయ సంగ్రామంలో అధికార వైసీపీని మట్టి కరిపించే దిశగా మిగతా పక్షాలు కూటమిగా కత్తులు నూరుతున్నాయి. సీట్ల సర్దుబాటుకు సుదీర్ఘ కసరత్తు చేస్తున్నాయి. పరస్పర సమన్వయంలో భాగంగా కొందరికి సీటు గల్లంతైనా అలాంటి నేతలతో టీడీపీ అధినేత చంద్రబాబు నేరుగా సంభాషిస్తున్నారు. జనసేనలోనూ కొంత జోష్ కనబడుతోంది. తాము ఆశించినట్లుగానే సీట్ల ఖరారు ఖాయంగా మారడంతో ఆ దిశగా రంగంలోకి దిగేందుకు సేన సిద్ధమవుతోంది. ఆది నుంచి కొంత అటూ ఇటుగా వున్న కమలం ఇకపై జనసేన-టీడీపీ కూటమితో జత కట్టేందుకు వీలుగా సీట్ల సర్దుబాటుకు దిగుతోంది.

వైసీపీని తరిమేయాలి

» సీట్లు రాకపోయినా బాధపడకండి.. మీ భవిష్యత్ నేను చూసుకుంటా
» ఏ కష్టం రానీయను.. పలువురి ఇన్‌చార్జ్‌లతో చంద్రబాబు సంభాషణ
» కమలంతో సీట్ల సర్దుబాటు యత్నాలు.. సేనకు దాదాపు రూట్ క్లియర్

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

కొన్నాళ్ల క్రితమే తెలుగుదేశం-జనసేన కూటమిగా ఏర్పడి రాజకీయ క్షేత్రంలో అధికార వైసీపీని దెబ్బ తీసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. ఎవరెన్ని స్థానాల్లో పోటీ చేయాలో చర్చించి ఏలూరు, నరసాపురం లోక్‌సభా స్థానాల్లో టీడీపీ సీట్లను ప్రకటించింది. ఇప్పుడు బీజేపీ జత కట్ట డం ఆ మేరకు సీట్ల సంఖ్య, ఎక్కడెక్కడ కేటాయించాలనే దానిపై రెండు రోజులుగా సుదీర్ఘ చర్చ సాగుతోంది. జనసేనకు కేటాయిస్తున్న స్థానాల్లో సుదీర్ఘకాలంగా టీడీపీ పటిష్టత కోసం పనిచేస్తున్న నియోజకవర్గ ఇన్ చార్జ్‌లకు కొంత భరోసా ఇచ్చే క్రమంలో టీడీపీ అధిష్ఠానం ఒకడుగు ముం దుకేసింది. ఇంతకుముందే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కొంద రితో ముఖాముఖీ మాట్లాడారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు కోసం అధినేత చంద్రబాబు కొన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారని, వీటిలో భాగంగానే జనసేనకు కేటాయిస్తున్న స్థానాల్లోనూ టీడీపీ ఉమ్మడిగా బాధ్య తలు తీసుకుంటున్నదని, మీ భవిష్యత్ విషయంలో పార్టీ కీలక నిర్ణయం తీసుకోబోతోందని కొందరిని సముదాయించారు. తాజాగా బీజేపీతో సంప్ర దింపుల కోసం ఢిల్లీలో బస చేసిన పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కొందరితో సంభాషించారు. ఉంగుటూరు టీడీపీ టికెట్ ఆశించడమే కాకుండా ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలను నిర్వర్తిస్తున్న మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులుతో శుక్రవారం చంద్ర బాబు సంభాషించారు. నియోజకవర్గ పరిస్థితులను ఆరా తీశారు. 'భయం లేదు.. మీ భవిష్యత్ విషయంలో అంతా నేను చూసు కుంటాను' అని గన్నికి చంద్రబాబు భరోసా ఇచ్చారు. టీడీపీ కేడర్ తమ నేత గన్ని వీరాంజనేయులుకు స్థానం లేకుండా పోయిందని అసంతృప్తితో వున్న నేపథ్యం లోనే చంద్రబాబు ఫోన్ చేసి మాట్లాడడంతో కొంత సర్దుబాటుకు వచ్చే అవ కాశం ఉంది. ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గమైన పోల వరం జనసేనకే ఖాయమైంది. ఆ నియోజకవర్గంలో ఇప్పటి వరకు చెమటోడ్చిన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొరగం శ్రీనివాస్‌తోనూ చంద్రబాబు సంభాషించి ఆయనకు హామీ ఇచ్చినట్టు సమాచారం. తాడేపల్లి గూ డెం నియోజకవర్గ ఇన్ చార్జ్ వలవల బాబ్జీతో చంద్రబాబు మాట్లాడారు. నరసాపురంలో పరిస్థితిని సర్దుబాటు చేసేందుకు చాన్నాళ్లుగా, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వున్న పొత్తూరి రామరాజుతోనూ ఢిల్లీ నుంచి చం ద్రబాబు సంభాషించారు. దీంతో తెలుగుదేశం పార్టీ పక్షాన తెలుగు సైన్యా న్ని పూర్తిగా సమాయత్తపరచడం, ఇంకోవైపు పొత్తు ధర్మాన్ని కాపాడడం, సమాంతరంగా ఇరు పార్టీల అభ్యర్థులు వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధించే దిశగా తెలుగుదేశం అధినేత చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు.

• భీమవరంలో జనసేనాధిపతి పవన్ పోటీ చేస్తే సరేసరి.. లేకుంటే ఆ స్థానాన్ని తమకే కేటాయించాల్సిందిగా బీజేపీ కోరినట్లు సమాచారం.

• బీజేపీ నరసాపురం లోక్‌సభ స్థానంతోపాటు, ఈ పరిధిలో వున్న భీమవరం, ఉండి, నరసాపురం అసెంబ్లీ స్థానాలను ఆశిస్తోంది.

కమలం కసరత్తు..

జనసేన-టీడీపీ కూటమితో జతకట్టేందుకు భారతీయ జనతా పార్టీ భారీ గా సీట్లను కేటాయించాల్సిందిగా ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం. బీజేపీతో జత కలిసిన తర్వాతే తాను పోటీ చేసే స్థానాలు ప్రకటించాలని జనసేన భావిస్తోంది. అందుకే తొలి జాబితాలో టీడీపీ తన అభ్యర్థులను ప్రకటించింది తప్ప, జనసేన తన కోటాలో భాగంగా అనేక స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి వున్నా జాప్యం చేసింది. ఈ తరుణంలో బీజేపీ నరసాపురం లోక్‌సభ స్థానంతో పాటు, ఈ పరిధిలో వున్న భీమవరం, ఉండి, నర సాపురం అసెంబ్లీ స్థానాలను ఆశిస్తోంది. ఢిల్లీలో బీజేపీ బాధ్యులు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షులు నడ్డాతో చర్చించారు. ఈలోపు నరసాపురం లోక్‌సభా స్థానం నుంచి పోటీ చేసేం దుకు రఘురామకృష్ణంరాజు సిద్ధంగా వుండడం, ఈ స్థానానికి అదనంగా అసెంబ్లీ స్థానాలు ఆశించడం ఇపుడు హాట్ టాపిక్‌గా మారింది. 2014లో ఎన్ని కల్లో తాడేపల్లిగూడెం నుంచి పైడికొండల మాణిక్యాలరావు గెలుపొందారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ తాము ఎన్ని స్థానాలను ఆశిస్తున్నామో వాటినే యథావిధిగా టీడీపీ అధి నేత, జనసేన అధ్యక్షుడికి ప్రతిపాదించారు. ఇంకోవైపు అభ్యర్థుల విష యంలో కొందరు అభిప్రాయసేకరణ చేస్తున్నారు. బీజేపీ అధికారికంగా ధ్రువీకరించక పోయినా ఈ సేకరణలో భూపతిరాజు శ్రీనివాసవర్మ, దివం గత కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి అభ్యర్థిత్వాలపైన ఆరా తీశారు. మరోవైపు ఏలూరు లోక్‌సభా స్థానం పరిధిలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి(తపన చౌదరి)తోపాటు మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు తనయుడు భాస్కర్, మాజీ ఎంపీ సుజనా చౌదరి పేర్లు చర్చకొచ్చినట్లు చెబుతున్నారు. వీరిలో తపన చౌదరి సీటు తనకే దక్కుతుందని విశ్వాసంతో వున్నారు. కైకలూరు స్థానాన్ని బీజేపీ చాన్నాళ్లుగా ఆశిస్తోంది. ఇదే ప్రతిపాదన ఆ పార్టీ జాబి తాలో వున్నట్లు చెబుతున్నారు. సీట్ల ఖరారుపై శనివారం నాటికి పూర్తి క్లారిటీ రానుంది.

కొత్తవారికి లేనట్టే..!

» పాత పింఛన్‌లే అందజేత
» రెండునెలలుగా దరఖాస్తు దారుల ఎదురుచూపులు
» అన్ని అర్హతలు ఉన్నా మంజూరు చేయని వైనం
» సమీపిస్తున్న ఎన్నికల కోడ్.. అర్హుల్లో ఆందోళన



ఏలూరు రూరల్, మార్చి 8 : దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామని చెబుతున్నా సీఎం జగన్ ప్రకటనలకే పరిమితం అవుతున్నారు. ఆచరణలో చేతులెత్తేయడంతో ప్రజలకు నిరాశ తప్పడం లేదు. నూతన పింఛన్ల మంజూ రు విషయంలోనూ ప్రభు త్వం దరఖాస్తుదారు లకు మొండిచేయి చూపింది. ఫిబ్రవరి, మార్చి నెలకు సంబంధించి సామాజిక తనిఖీలు పూర్తయ్యాయి. జిల్లాలోని అన్ని సచివాలయాల నుంచి ఎంపీడీవో కార్యాలయాలకు అక్కడి నుంచి అమరావతిలోని సెర్ప్ కార్యాలయానికి అర్హుల జాబితాలు వెళ్లాయి. అయితే అన్ని అర్హతలున్నా పింఛన్లు మంజూరు కాకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. కొద్దిరోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పింఛన్లు మంజూరవుతాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలో ఎంతోమంది కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అధికారుల ఆదేశాలతో విద్యుత్‌బిల్లులు, ఆధార్, ఓటర్ కార్డులతో సంబంధిత సచివాలయాల్లో నమోదు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో సంబంధిత సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పరిశీలించి పింఛన్ మంజూరుకు నివేదికలు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా పదివేల మందికిపైగా దరఖాస్తు చేసుకోగా వీరిలో అధికంగా దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు ఉన్నారు. జనవరిలో కొంతమందికి కొత్త పింఛన్లు మంజూరు చేశారు. ఫిబ్రవరి, మార్చిలో మాత్రం మంజూరు చేయ లేదు. సామాజిక తనిఖీలు నిర్వహించి నివేదికలు అందిం చినా మంజూరు కాకపోవడంపై దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధుల సమస్య కారణంగానే మంజూరులో జాప్యం నెలకొందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తు న్నాయి. ఇప్పటివరకు జిల్లాలో లక్షా 93 వేల 875 మందికి ఆయా రకాల పించ న్లు అందజేస్తున్నారు. 2019 నుంచి ఇప్పటివరకు రూ.75,484 కొత్త పింఛన్లు అందజేసినట్టు అధికారులు పేర్కొంటు న్నారు. పాతవారికే పింఛన్లు అందించి కొత్త దరఖాస్తుదారులు ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కొత్త దరఖాస్తుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నీరందక నెర్రలు!

» 350 ఎకరాల్లో ఎండుతున్న వరి పంట
» దెందులూరు మండలంలో రైతుల ఆవేదన





పాలగుడెం వద్ద ఎండుతున్న వరి పొలాలు

దెందులూరు, మార్చి 8 : వరి రైతులకు సాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూస్తాం, రెండు పంట లు వేయండి అంటూ జలవనరుల శాఖ అధికారు లు, ప్రజాప్రతినిధులు చెప్పడంతో రైతులు వరి పంట వేశారు. అయితే కాల్వ నుంచి నీరు రాకపోవ డంతో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. దెందు లూరు నియోజకవర్గం పరిధిలోని ఏలూరు రూరల్ మండలం, దెందులూరు మండలాల పరిధిలో పాల గూడెం, కొవ్వలి పరిధిలో సూమారు 350 ఎకరాల్లో వరి పంటకు సాగునీరు అందడం లేదు. పొట్టదశ లో నీరు లేక గింజలు తాలుపోతున్నాయి. నేల నెర్రలు బారడంతో అన్నదాతలు కంట కన్నీరు కారుతోంది. మూడేళ్లుగా ఈ ప్రాంతంలో ఏటా పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదు. చేసేది లేక కృష్ణా కాల్వ నుంచి వచ్చే వ్యర్థ జలాలను మో టార్ల ద్వారా తోడుకుంటూ కొంతమంది తమ పంట ను కాపాడుకుంటున్నారు. ఎకరం వరి పంట మో టార్ ద్వారా తడవాలంటే మోటారు అద్దె, డీజిల్, కూలీల ఖర్చు అన్నీ కలిపి రూ.1,100 వరకు అవు తుంది. కాల్వ దగ్గరగా ఉన్న వారికే ఈ అవకాశం ఉంది. దూరంగా ఉన్న వరి పొలాలకు మోటార్ల ద్వారా నీరు తోడే అవకాశం లేదు. తమ కళ్ల ముందే పంట పొలాలు ఎండి పోతుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కాల్వ ద్వారా నీరు అందించి తమ పంటలను కాపాడాలని పాలగూడెం, కొవ్వలి, పోతునూరు, ఉండ్రాజవరం రైతులు,కౌలు రైతులు కోరుతున్నారు.

పొట్ట దశలో ఎండుతోంది..

రెండేళ్లుగా సాగునీరు సరిపోవడం లేదు. పంట వేయకూడదనుకున్నాం. అధికారులు నీళ్ల వస్తాయి, పంటలు వేసుకోమన్నారు. ఇప్పుడు నీరు సరిపోక పొట్ట దశలో ఎండి పోతోంది.

- లంక శ్రీనివాసరావు, పోతునూరు

సాగు నీరందించాలి

ప్రభుత్వం పొలాలకు సాగు నీరందించేలా చర్యలు తీసుకోవాలి. అష్ట కష్టాలు పడి వరి పంట వేస్తే పొట్ట దశలో సాగునీరు అందక రైతులు, కౌలు రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

- కె.శ్రీనివాసరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

నేటి నుంచి ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 8 : ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమవుతోంది. ఈ మేరకు ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్పాట్ వాల్యూయేషన్ క్యాంపులో తొలుత సంస్కృతం జవాబుపత్రాల మూల్యాంకనాన్ని చేపట్టనున్నారు. సంఖ్యాపరంగా ఈ సబ్జెక్టు జవాబుపత్రాలు ఎక్కువగా ఉండడంతో ముందుగా సంస్కృతం నుంచి ప్రారంభిస్తున్నారు. పూర్తిస్థాయి స్పాట్ వాల్యూయేషన్‌ను ఈ నెల 16 నుంచి చేపట్టడానికి నిర్ణయించారు. కాగా ఇంటర్ ప్రధాన పరీక్షలు 15వ తేదీతో ముగియనున్నాయి.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టుల భర్తీకి పదోన్నతులు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 8 : జిల్లా పరిషత్, గవర్నమెంట్ హైస్కూళ్లలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లను, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్ కేడర్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌లుగా పదోన్నతి పై నియమించనున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని సంబంధిత అర్హుల వివరాలతో ప్రతిపాదనలను పంపాలని ఉత్తర్వులు జారీ అయ్యాయని డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, ఎంపీఈడీ కోర్సులను 50 శాతం మార్కులతో పూర్తిచేసి కనీసం రెండేళ్ల సర్వీసువున్న వ్యాయామోపాధ్యాయులు పదోన్నతికి అర్హులన్నారు. ఇప్పటికే హైకోర్టులో పెండింగ్‌లో వున్న కేసులపై తుదితీర్పుకు లోబడి ఈ పదోన్నతులుంటాయని తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురి మృతి

7

» మరో యువకుడికి తీవ్ర గాయాలు..
» పాలకొల్లు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స

కలుషిత ఆహారం తినడం వల్లే అస్వస్థత

» డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహన్‌రావు

నూజివీడు, మార్చి 8 : ఇటీవల నూజివీడు జంగాలపేటకు చెందిన పలువురు అస్వస్థతకు గురవ్వడానికి కలుషిత ఆహారం తీసుకోవడమే కారణమని డిప్యూటీ డీఎంహెచ్‌వో జాస్తి జగన్మోహన్‌రావు తెలిపారు. పట్టణంలోని బంగినపల్లితోట యూపీహెచ్‌సీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల డయేరియా లక్షణాల తో ఇద్దరు మృతి చెందగా పలువురు అస్వస్థతకు గురవ్వ డంతో సర్వేలు నిర్వహించామన్నారు. మునిసిపల్ సిబ్బం దితో కలిసి పరిసరాలను శానిటేషన్ చేయడంతో పాటు శాంపిల్స్‌ను తీసుకుని పరీక్షలకు పంపించా మన్నారు. అయితే మృతి చెందిన మద్దిరాల తాతయ్యబాబు అలి యాస్ బాలకృష్ణ, వాంతులు, విరోచనాలతో స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడని, ఆరోగ్యస్థితి నిలకడగా లేక పోవడంతో మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం విజయవాడకు రిఫర్ చేయగా అతడు కార్డియాక్ అరెస్ట్‌తో మృతి చెందా డన్నారు. షేక్ జానీబీ (32) ఇంటివద్ద గ్యాస్ట్రిక్ నొప్పితో మృతి చెందినట్టు తాము గుర్తించామన్నారు. మిగిలిన బాధితులు ఎం.లక్ష్మీదీక్షిత, ఎం.లక్ష్మి త్రినయని, జంగం పుల్లమ్మ, నెరుసు సత్యనారాయణ, పిల్లగళ్ల విజయ్‌కృష్ణ, నెరుసు మంగమ్మ, కంచర్ల చైతన్యల ఆరోగ్యపరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందన్నారు. సమావేశంలో వైద్య అధికారులు కుర్రా నరేంద్ర కృష్ణ, డాక్టర్ సౌమ్య, డాక్టర్ సురుచి తదితరులు పాల్గొన్నారు.




పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి, భీమవరం సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు




ఆచంటేశ్వరునికి పాలభిషేకం, వీరంపాలెం శివాలయంలో భక్తుల క్యూ

మార్మోగిన శివనామస్మరణ

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి పూజలు
- శివాలయాలు కిటకిట

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని శివాలయాల్లో శుక్రవారం మహాశివరాత్రి పూజలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో శివనామ స్మరణ మార్మోగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల వద్ద క్యూ కట్టారు. ఆయా ఆలయాల్లో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో

పాలకొల్లు టౌన్, మార్చి 8 : పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం వేకువ జామునుంచి ఆలయ అర్చకులు మంత్రోచ్చరణలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. యాత్రికులు, భక్తులతో ఆలయం కిటకి టలాడింది. మహిళలు సామూహిక వ్రతం, కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక స్వచ్ఛంద సంస్థలు భక్తులకు బాదంపాలు, మజ్జిగ, తాగునీరు, ప్రసా దాలను పంపిణీ చేశారు. దేవస్థానం ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఈవో యాళ్ల సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గునుపూడి సోమేశ్వరాలయంలో..

భీమవరంటౌన్, మార్చి 8 : పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు క్యూట్టడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. తెల్లవారుజామున ఆలయ అర్చకులు కందుకూరి సోంబాబు, చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు నిర్వహించి అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివ రామరాజు స్వామిని దర్శించుకుని పూజలు చేయించుకున్నారు.

భక్తులకు తప్పని ఇబ్బందులు

పర్యవేక్షణ లోపంతో భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తుల తాకిడి పెరిగింది. అనంతరం భక్తుల రద్దీ తగ్గింది. పలుకుబడి ఉన్నవారికి మాత్రమే శివయ్య దర్శనం త్వరగా కలుగుతుందని భక్తులు బహిరంగంగా విమర్శించారు. వన్ టౌన్ సీఐ అడబాల శ్రీనివాస్ ప్రత్యేక పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో రామకృష్ణం రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆచంటేశ్వరుని ఆలయంలో..

ఆచంట, మార్చి 8 : ఆచంటలోని ఆచంటేశ్వరుని ఆలయం మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం వేకువజాము నుంచి సాయంత్రం వరకు శివనామస్మరణతో హోరెత్తింది. ఉదయాన్నే భక్తులు కోడేరు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం ఆచంటేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆచంటేశ్వరుడిని ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు దంపతులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, వైసీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల దర్శించుకున్నారు. భక్తులక కావాల్సిన ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ విద్యాసాగర్, ఈవో రాము పర్యవేక్షించారు. ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కన్నులపండువగా రథోత్సవం

ఆచంటేశ్వరుని రథోత్సవం కన్నులపండువగా సాగింది. రథాన్ని పలు రకాల పూలతో అలంకరించి సన్నాయిమేళాలు బాణసంచా కాల్పులు మధ్య గ్రామ పుర వీధులలలో రథోత్సవం నిర్వహించారు.

వీరంపాలెం శివాలయంలో..

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 8: వీరంపాలెం శివాలయంలో శివనామస్మరణ మార్మోగింది. రాత్రి 2 గంటల నుంచి స్ఫటికలింగేశ్వరస్వామికి మానస సరోవర జలంతోపాటు, దేశంలోని 12 నదీ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి సర్వజనులకు స్ఫటికలింగ దర్శన అవకాశం కల్పించారు. ఆలయ ప్రాంగణంలోని మహాదేవునికి విశేష ద్రవ్యాలు, అన్న కుంభాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్ఫటికలింగేశ్వరుడిని, మహాదేవుడిని దర్శించుకున్నారు. తాడేపల్లిగూడెం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, వైసీపీ నేత కొట్టు విశాల్ తదితర ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. రాత్రికి లక్ష దీపార్చన చేశారు. భక్తులకు మంచినీరు. మజ్జిగ ప్యాకెట్‌లతోపాటు, ఆహార ప్యాకెట్‌లు అందించారు. పూజా కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణ సిద్ధాంతి పర్యవేక్షించారు.



బలివేలో భక్తజన సందోహం, (ఇన్‌సెట్‌లో) పిండప్రదానంలో చింతమనేని

బలివే రామస్వామి సన్నిధిలో..

పెదవేగి, మార్చి 8 : బలివే రామస్వామ సన్నిదిలో భక్తులు పోటెత్తారు. వేలసంఖ్యలో భక్తులు తమ్మిలేరులో పుణ్యస్నానాలు చేసి రామస్వామిని దర్శించుకున్నారు. పెదవేగి, దెందులూరు, పెదపాడు, ఏలూరు మండలాల తోపాటు సుదూర ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చి తమ్మిలేరులో పుణ్యస్నానాలు చేపి, పితృతర్పణాలు వదిలారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శుక్రవారం తెల్లవారుజామునే బలివే చేరుకుని, తల్లిదండ్రులకు పిండప్రదానం చేశారు. పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్, పెదవేగి మండలం విజయరాయి, నడిపల్లి గ్రామాల వరకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. పెదవేగి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య కేంద్రానిన ఏర్పాటు చేసి భక్తులకు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ద్రావణాన్ని సరఫరా చేశారు.

నేత్రపర్వం.. శివకల్యాణం



శివయ్యకు పంచ హారతులిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల, మార్చి8: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతున్న శివదేవుని ఆలయం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి కల్యాణం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయ గర్భాలయంలో వున్న శివయ్యకు అర్చకులు, పండితులు విశేషఅభిషేకాలు చేశారు. అలంకరణలు చేసి పంచహారతులిచ్చారు. రాత్రి లింగోద్భవ సమయంలో గంగా పార్వతీ సమేత శివదేవుని కల్యాణం భక్తుల శివనామస్మరణల నడుమ వైభవంగా సాగింది.



పార్థివలింగపూజలో భక్తురాలు

ఆకట్టుకున్న పార్థివలింగ పూజ

ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురంలో ఓ భక్తుడు నిర్వహించిన పార్థివ లింగపూజ చూపరులను ఆకట్టుకుంది. పుట్టమన్నుతో శివలింగాన్ని తయారుచేశారు. అనంతరం ఆ శివలింగానికి తెల్లవార్లూ పూజలు, అభిషేకాలు జరిపారు. గ్రామానికి చెందిన బావి శెట్టి మధుసూదనరావు గత 30 ఏళ్లగా ఈపార్థివ లింగ పూజ నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శివాలయాల వద్ద పటిష్ఠ బందోబస్తు



పట్టిసీమలో పరిశీలించిన ఐజీ ఆశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, మార్చి 8 : మహాశివరాత్రిని పురస్కరించుకుని జిల్లాలో వున్న శివాలయాల వద్ద పోలీసు యంత్రాంగం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐజీ జీవీ ఆశోక్‌కుమార్ ఆదేశాలతో ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి జిల్లాలోని భక్తుల రద్దీ ఎక్కువగా వున్న శివాలయాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా పట్టిసీమ, బలివే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి పట్టిసీమకు స్వయంగా వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. భక్తులకు ఎటువంటి అవాంతరాలు లేకుండా ఉండేలా చర్యలపై సిబ్బందితో సమీక్షించారు. భక్తులు నిర్దేశించిన క్యూలైన్లను పాటిస్తూ భగవంతుని దర్శించుకోవాలని సూచించారు. ఎస్పీ మేరీప్రశాంతి పోలీసు సిబ్బందితో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.



పట్టిసీమ వీరేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

పట్టిసీమ వీరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పోలవరం, మార్చి 8:పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో హర హర మహాదేవ శంభో శంకర అంటూ శివ నినాదంతో మార్మోగింది. శివక్షేత్రానికి శివరాత్రి సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు రెండున్నర లక్షల మంది భక్తులు దర్శించి పూజలు నిర్వహించారు. భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి పితృదేవతలకు పిండప్రదానాలు నిర్వహించారు. లింగోద్భవ కాలంలో ఆలయ ట్రస్టీ కొచ్చర్ల కోట జగన్నాధం కుటుంబసభ్యులు, ఈవో ఎస్.సంగమేశ్వర శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, ఐజీ అశోక్ కుమార్, ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్ స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాలి నడక భక్తులకు తప్పని ఇబ్బందులు

ఈ ఏడాది ఉత్సవాలకు వచ్చిన భక్తులకు కాలి నడక మరింత దూరమై ఇబ్బందులకు గురయ్యారు. ఎండలో ఫెర్రీ పాయింట్ నుంచి ఇసుక తిన్నెల్లో చలువ పందిళ్ల వరకు ఎండలో నడవడానికి ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు సైతం ఎండను తాళలేక ఫ్లెక్సీల నీడన తలదాచుకున్నారు. దారి పొడవునా మంచినీటి ప్యాకెట్ల పంపిణీ, చిన్నారులకు పాలు పంపిణీ భక్తులకు కొంత ఉపశమనం కలుగజేసింది.

ఏర్పాట్ల నిర్వహణ సంతృప్తికరం : డీఎస్పీ

పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నాయని డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి అన్నారు. ఉత్సవ ఏర్పాట్లలో 500 మంది పోలీస్ సిబ్బందిని బందోబస్తుకి వినియోగించామన్నారు. విపత్తుల శాఖ నుంచి 40 మంది, మత్స్యశాఖ-4 షిఫ్టులుగా 90 మంది సిబ్బంది, 130 మంది గజ ఈతగాళ్ళు, వైద్య ఆరోగ్యశాఖ 280 మంది సిబ్బంది మూడు షిఫ్టులు. రెవెన్యూ శాఖ నుంచి 186 మంది సిబ్బంది, అంగన్వాడీలు 70 మంది, గ్రామీణ నీటి సరఫరా శాఖ నుంచి ఏడు మండలాల ఏఈలు, 40 మంది సిబ్బంది ఒక ఎస్ఈ, డీఈ ఉత్సవాల్లో సేవలందించారన్నారు.



శివలింగాన్ని దర్శించుకున్న మంత్రి వనిత



పట్టిసీమ గోదావరి నది ఒడ్డున పిండ ప్రదానాలు



తపన చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్నారుల కోలాటం

సుందరగిరిపై మహాసుదర్శన నృశింహయజ్ఞం




నృశింహయజ్ఞం నిర్వహిస్తున్న నరసింహ గురూజీ, ఆలయ ఆవరణలో సూర్యనమస్కారాలు చేస్తున్న రుత్వికుడు

ద్వారకాతిరుమల, మార్చి8: సుందరగిరిపై వున్న లక్ష్మీనరసింహుని ఆలయంలో శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన శ్రీమహాసుదర్శన నృశింహయజ్ఞం భక్తులకు కన్నులపండువైంది. ప్రతి ఏటావలే మహాశివరాత్రి రోజు సాయంత్రం మొదలుగా తెల్లవార్లూ ఈ యజ్ఞాన్ని ఎంతో భక్తిప్రపత్తులతో సంప్రదాయంగా నిర్వహించారు. స్వయంభూవైన నరసింహస్వామికి ఈ యజ్ఞం జరపడం వల్ల లోకశాంతి చేకూరుతుందని నమ్మకం, ఈ సందర్భంగా ఆలయపరిసరాలను సుందరీకరించారు. హైదరాబాదుకు చెందిన కొచ్చర్లకోట నరసింహం ఆధ్వర్యంలో సీహెచ్ కుటుంబరావు యజ్ఞ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం విశేషకార్యక్రమాలు జరిగాయి. యజ్ఞక్రతువులో భాగంగా అభిషేకం నిమిత్తం ఏర్పాటుచేసిన 1,331 కలశాలను వినియోగించారు. పలు వనమూలికలు, భక్ష్యాలు, పలు రకాల ద్రవ్యాలు, తొమ్మిది రకాల సమిదులు, ఖరీదైన ద్రవ్యాలను యజ్ఞక్రతువుకు ఉపయోగించారు. తెల్లవార్లూ జరిగిన ఈ యజ్ఞక్రతువు భక్తులను అలరించింది.

నేడు వైద్య ఉద్యోగులకు క్రమబద్ధీకరణ ఉత్తర్వుల జారీ

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 8:ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న పలు కేడర్ల ఉద్యోగుల్లో అర్హులైనవారికి సర్వీసుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులను శనివారం జారీ చేయనున్నారు. ఈ మేరకు జీవోలు 30,31 ప్రకారం తొలివిడతగా ప్రభుత్వం పంపిన జాబితాలో వున్న ఉద్యోగులకు శనివారం ఉదయం పది గంటలకు ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో రెగ్యులరైజేషన్ ఆర్డర్లను ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లాలో తొలివిడతగా ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు 161 మందితో కూడిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపగా 114 మందికి, ల్యాబ్ టెక్నీషియన్లు 14మందికి గాను ఒకరికి, ఫార్మాసిస్టులు 14మందికిగాను 9మందికి, ఎంపీహెచ్‌ఏ(ఫిమేల్)/ఏఎన్ఎంలు 78మందికి గాను 61మందికి శనివారం క్రమబద్ధీకరణ ఉత్తర్వులు ఇస్తారు. వీరితోపాటు ఇద్దరు ఆప్తాల్మిక్ అసిస్టెంట్లకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా పంపినప్పటికీ తొలివిడత జాబితాలో క్లియరెన్స్ రాలేదు. ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనల్లో దాదాపు 70శాతం మంది ఉద్యోగులకు క్రమబద్ధీకరణ ప్రయోజనం లభించినట్లయిందని డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు తెలిపాయి. సంబంధిత ఉద్యోగులు ప్రస్తుతం పనిచేస్తున్న శాంక్షన్డ్/క్లియర్ వెకెన్సీ స్థానాల్లోనే రెగ్యులర్ ఉద్యోగులుగా ఇకమీదట కొనసా గుతారు. ప్రతిపాదిత జాబితాల్లోని మిగతా ఉద్యోగులకు కూడా ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే అంటే సోమ లేదా మంగళవారాల్లో రెండు, మూడోవిడత క్రమబద్ధీకరణ జీవోలు జారీఅయ్యే అవకాశం ఉందని వివరించాయి.

కాపు సంక్షేమ సేన కమిటీలు రద్దు : జోగయ్య

పాలకొల్లు, మార్చి 8: రాష్ట్రంలో కాపు సంక్షేమ సేన కమిటీలన్నీ తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్య శుక్రవారం పాలకొల్లులో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడైన జోగయ్య పలు హోదాల్లో పనిచేస్తున్న అందరి పదవులు, అన్ని కమిటీలను రద్దు పరుస్తూ తీర్మానం చేసినట్టు పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం కాపు సంక్షేమ పోరాటం నుంచి తప్పుకున్న నాటి నుంచి తాను కాపు సంక్షేమ సేనను ప్రారంభించానని తెలిపారు. అప్పటినుంచి కాపులకు విద్య, ఉద్యోగాలలో ఐదు శాతం రిజర్వేషన్ కోసం అనేక పోరాటాలు చేసి నిరాహార దీక్ష చేపట్టానన్నారు. కానీ నా కుమారుడి రాజకీయ భవిష్యత్తు కోసం తాను ఎప్పుడూ నా వ్యక్తిత్వాన్ని తాకట్టు పెట్టలేదన్నారు. పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేయాలనే నా పోరాటాన్ని కొందరు ఎందుకు తప్పుగా భావిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఇక నుంచి కేవలం రాజకీయ విశ్లేషకుడిగా మాత్రమే కొనసాగుతానన్నారు.

కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి రాజీనామా : మల్లినీడి

కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఉపాధ్యక్ష పదవీ బాధ్యతలకు రాజీనామా చేస్తున్నానని మల్లినీడి తిరుమలరావు (బాబి) గురువారం సాయంత్రం తెలిపారు. రాష్ట్రంలో ఏర్పడిన తాజా రాజకీ య పరిణామాల వల్ల కాపు సంక్షేమ సేనపై ఉన్న విశ్వసనీయత సన్నగిల్లిందనే విషయాన్ని సేన వ్యవస్థాపక అధ్యక్షుడు చేగొండి హరిరామజోగయ్యకు తెలుపుతూ రాజీనామా చేస్తున్నానన్నారు.

స్వచ్ఛందంగా తూడు తొలగించిన రైతులు



కె.పెంటపాడు చిలకం తూములో తూడు తొలగిస్తున్న సర్పంచ్ సత్యనారాయణ, రైతులు

పెంటపాడు, మార్చి 8: వంతుల వారీ విధానంలో తమ పొలాలకు సాగునీరు అందించే పంటబోదెలో తూడు విపరీతంగా పెరిగిపోవడంతో కె.పెంటపాడు రైతులు స్వచ్ఛందంగా తూడు తొలగించుకున్నారు. సుమారు 500 ఎకరాల ఆయకట్టు కల్గిన ఊరు మొదల తూము నుంచి చిలకం తూము వరకు కాల్వలో ఉన్న తూడును శుక్రవారం తొలగించుకున్నారు. కార్యక్రమానికి నాయకత్వం వహించిన సర్పంచ్ పీతల సత్యనారాయణ మాట్లాడుతూ వంతుల వారీ విధానంలో సాగు నీరు సరిపోవడంలేదని అధికారులు సమస్య పరిష్కరించాలన్నారు.

క్రైం సమాచారం

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురి మృతి

మరో యువకుడికి తీవ్ర గాయాలు.. పాలకొల్లు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స



ఆర్.అభిరామ్ సీహెచ్.ఆనంద్ ఎస్.దుర్గారావు(ఫైల్ ఫొటోలు)

ఆచంట, మార్చి 8 : ఆచంట-మార్టేరు ఆర్అండ్‌బీ రహదారిలో ఆచంట కొఠాలపర్రు వంతెన వద్ద ఎదురెదురుగా మోటారు సైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆచంట ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాలివి.. ఆచంట పంచాయతీ పరిధి గొల్లపల్లివారిచెరువుకు చెందిన రొక్కాల అభిరామ్ (22) ఆచంట పెదపేటకు చెందిన చదలవాడ ఆనంద్(22) ఇరువురూ స్నేహితులు. వీరు తూర్పుపాలెం నుంచి మోటారుసైకిల్‌పై ఆచంట వస్తున్నారు. అదేవిధంగా పోడూరు మండలం పండితవిల్లూరు పంచాయతీ పరిధిలో లక్ష్మీచెరువు గట్టుకు చెందిన చుక్కా దుర్గారావు (29), పితాని సాయి ఇరువురు స్నేహితులు సరదాగా ఆచంటలో జరుగుతున్న రామేశ్వరస్వామి శివరాత్రి తిరునాళ్ళు వీక్షించి గురువారం అర్ధరాత్రి ఆచంట నుంచి మోటారు సైకిల్‌పై పండితవిల్లూరు వెళుతుండగా మార్టేరు-ఆచంట కొఠాలపర్రు వంతెన వద్ద ఈ రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. అభిరామ్, ఆనంద్ ఘటన స్థలంలోనే మృతి చెందగా మిగిలిన ఇద్దరిని 108 వాహనంలో ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో దుర్గారావు మృతి చెందినట్టు తెలిపారు. తీవ్ర గాయాలైన పితాని సాయి పాలకొల్లు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఆచంట మండలంలో విషాదఛాయలు..

ఈ ప్రమాదంలో మృతి చెందిన రొక్కాల అభిరామ్, చదలవాడ ఆనంద్ ఇద్దరు యువకులు పనులు చేసుకుంటున్నారు. అభిరామ్, ఆనంద్ తల్లులు ఉపాధి నిమిత్తం ఇటీవల గల్ఫ్ దేశానికి వెళ్లారు. మరొకరు చుక్కా దుర్గారావుకు నాలుగేళ్ల క్రితం వివాహం కాగా మూడేళ్ల కుమార్తె ఉంది. శివరాత్రి పండుగ రోజున ఆచంటలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృత దేహాలను పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్ఐ రాజ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పవిత్ర స్నానానికి వెళ్లి.. వృద్ధురాలి మృతి

భీమడోలు మార్చి 8 : భీమడోలు మండలం పూళ్ళ శివారు సదాశివపురం కాల్వ రేవులో శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం ఉదయం పవిత్ర స్నానం నిమిత్తం వెళ్లిన వడ్లపాటి స్వర్ణదుర్గ(63) ఏలూరు కాల్వలో గల్లతయింది. ఉదయం ఆరు గంటల సమయంలో కొందరు మహిళలు నీళ్ల తెచ్చేందుకు కాల్వకు వెళ్లగా రేవు గట్టు వద్ద సెల్ ఫోన్, దుస్తులు గమనించి స్వర్ణ దుర్గ బంధువులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసి భీమడోలు విపత్తుల శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఆమె మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టంకు పంపారు.

గల్లంతైన మృతదేహం లభ్యం

పెదపాడు, మార్చి 8 : పెదపాడు మండలం వట్లూరు గ్రామానికి చెందిన వసంతవాడ ఏడుకొండలు గురువారం గేదెలు మేపడానికి వెళ్లి చెరువు ఊబిలో పడి గల్లంతయ్యాడు. గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఏడుకొండలు ఆచూకీ లభించలేదు. అతడి మృతదేహం శుక్రవారం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని త్రీటౌన్ సీఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

చికిత్స పొందుతూ సచివాలయ ఉద్యోగి మృతి



శేషుబాబు(ఫైల్)

ఉంగుటూరు, మార్చి 8 : జాతీయ రహదారిపై మోటారు సైకిల్ అదుపు తప్పి ఓ ఆటోను ఢీకొనగా తలకు తీవ్ర గాయమైన కైకరం సచివాలయ సీనియర్ అసిస్టెంట్ మద్ది శేషుబాబు(61) రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేబ్రోలు పోలీసుల తెలిపిన వివరాలివి.. కైకరం సచివాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మద్ది శేషుబాబు ఈనెల 4వ తేదీన సాయంత్రం విధి నిర్వహణ ముగించుకుని తాడేపల్లిగూడెంలోని తన ఇంటికి వెళ్లే క్రమంలో కైకరం శివారు మోటారుసైకిల్ అదుపు తప్పి ఆటోను ఢీకొనగా తలకు తీవ్ర గాయమైంది. తొలుత చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం అనంతరం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. ఆయన మృతి పట్ల గ్రామ సర్పం సలగాల గోపి, కార్యదర్శి నాగేంద్ర, సచివాలయ సిబ్బంది తదితరులు సంతాపం తెలిపారు.

చల్లచింతలపూడిలో తల్లిపై కత్తితో కొడుకు దాడి

దెందులూరు, మార్చి 8 : నవమాసాలు మోసి, పెంచిన కన్న తల్లిపై కొడుకు కత్తితో దాడి చేసిన ఘటన దెందులూరు మండలం చల్లచింతలపూడిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. చల్లచింతలపూడి గ్రామానికి చెందిన నల్లిబోయిన వరలక్ష్మి పెదపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో ఇరవైఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత కొంతకాలంగా భర్తకు నల్లిబోయిన వరలక్ష్మి మధ్య మనస్పర్థల కారణంగా విడిపోయారు. భర్త పెదపాడులో 20 ఏళ్ల వయస్సు గల కొడుకుతో వేరుగా ఉంటుండగా వరలక్ష్మి కుమార్తెతో కలిసి చల్లచింతలపూడిలోని జగనన్న కాలనీలో ఉంటుంది. శుక్రవారం ఉదయం ఐదు గంటల సమయంలో ఇంటిలో నిద్రపోతున్న వరలక్ష్మి ఇంటికి వచ్చిన కుమారుడు తలుపు కొట్టడంతో ఆమె తలుపు తీసింది. అప్పటికే కత్తితో సిద్ధంగా వున్న కుమారుడు నల్లిబోయిన చక్రపాణి కత్తితో మెడపై దాడి చేశాడు. ఆమె చేతులు అడ్డు పెట్టడంతో చేతికి గాయం కాగా పెద్దగా కేకలు పెట్టడంతో కుమారుడు పారిపోయాడు. కొంతమంది గ్రామస్థులు ఆమె ఏలూరు ఆసుపత్రికి తరలించారు. ఆస్తి వివాదం కారణమని కొంతమంది స్థానికులు అనుమానిస్తున్నారు. మహిళా దినోత్సవం రోజు తల్లిపై కుమారుడు దాడి చేయడంతో ఈ విషయం గ్రామంలో చర్చనీయాంశమైంది.

కనీవినీ ఎరుగని రీతిలో బీసీ డిక్లరేషన్



టీడీపీ-జనసేన పది అంశాలతో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ కనీవినీ ఎరుగని రీతిలో ఉంది. ఇటువంటి డిక్లరేషన్ నభూతో నభవిష్యత్ అని చెప్పొచ్చు. టీడీపీ వచ్చిన తర్వాతే బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు కలిగాయి. 50 ఏళ్లకే పెన్షన్, ప్రత్యేక రక్షణ చట్టం, ఆర్థికాభివృద్ధి, ఉపాధికి ప్రోత్సాహకాలు ఇవ్వడం వంటివి అమలు చేస్తామనడం బీసీలకు ఇచ్చే ప్రాధాన్యత స్పష్టమవుతోంది. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బీసీలు నిలదొక్కుకునేందుకు టీడీపీ-జనసేన ప్రకటించిన డిక్లరేషన్ ఊతమిస్తోంది. బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ఈ పొత్తు అధికారంలోకి రావాల్సిందే..

- కూరాకుల బుజ్జి యాదవ్

బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ద్వారకాతిరుమల

ఉద్యాన వర్సిటీలో మహిళా దినోత్సవం



ఆటల పోటీల్లో మహిళా ఉద్యోగులు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 8 :వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆవరణలో జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బందికి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ డాక్టర్ ఏఎస్ పద్మావతమ్మ, డాక్టర్ సలోమిసునీత, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధవి మాట్లాడారు.

గోదావరి ఇసుక రీచ్‌కి అడ్డంగా కందకం

- ఇసుక అక్రమ తవ్వకాలకు రెవెన్యూ అధికారుల చెక్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఇబ్రహీంపేట ఇసుక రీచ్‌కి కందకం తవ్విస్తున్న తహసీల్దార్ అచ్యుత కుమారి

కుక్కునూరు,మార్చి 8 : కుక్కునూరు మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'ఇసుక దోచేస్తున్నారు' అనే శీర్షికన కథనానికి రెవెన్యూశాఖ అధికారులు స్పందిం చారు. కుక్కునూరు తహసీల్దార్ అచ్యుత కుమారి ఇసుక అక్రమ రవాణాకు చెక్ చెప్పాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఇబ్రహీంపేట గోదావరి ఇసుక రీచ్‌కి వెళ్లే రహదారికి అడ్డంగా ఎక్స్‌కవేటర్ ఉపయోగించి కందకం తవ్వించారు. దీంతో ఇసుక తరలించడానికి వేరే మార్గం లేకుండా పోతుందని, అక్రమ రవాణాకు చెక్ పడుతుందని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకట్, వీఆర్వో ఇబ్రహీం పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం రిలే దీక్ష



రిలే దీక్ష చేస్తున్న విజయకుమార్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 8: రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశాన్ని మేనిఫెస్టోలో ప్రకటించాలని కోరుతూ తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన కూసంపూడి విజయకుమార్ శుక్రవారం రిలే దీక్ష చేపటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదాతో రాష్ట్రానికి పరిశ్రమలతో పాటు రైల్వేజోన్ రావడంతో పాటు విశాఖ ఉక్కు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

కోరుకొల్లులో ఓటర్ల పరిశీలన

పాలకోడేరు, మార్చి 8 : కోరుకొల్లు గ్రామంలో 100 ఓట్లు బయటి వారివి చేర్పించారంటూ గ్రామానికి చెందిన రామాంజనేయరాజు ఎలక్షన్ కమిషన్‌కి ఫిర్యాదు చేయడంతో ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో శుక్రవారం ఇంటింటికి వెళ్ళి విచారణ చేపట్టడం జరిగిందని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో), ఉండి నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆర్.విక్టర్ తెలిపారు. పాలకోడేరు తహసీల్దార్ నాగార్జున, వారి సిబ్బందితో, పంచాయతీ కార్యదర్శులు, ఉండి తహసీల్దార్ శ్రీనివాస్ తదితర అధికారులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని ఉండి ఎన్నికల అధికారి ఆర్.విక్టర్ తెలిపారు.



ఏలూరులో రామలింగేశ్వరస్వామికి పాలభిషేకం, శివనగర్‌లో మల్లికార్జునస్వామి


తడికలపూడి గాంగేశ్వరస్వామి


పెదపాడులో సోమేశ్వరస్వామి


కుక్కునూరులో భక్తుల పూజలు


తాడువాయి వీరేశ్వరస్వామి


టి.నరసాపురంలో ప్రత్యేక అలంకరణ


శనివారపుపేటలో శివయ్యకు అభిషేకం

హర హర మహాదేవ

● శివ నామ స్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు ● పరమ శివుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు



పట్టిసం క్షేత్రం వద్ద గోదావరిలో భక్తుల పుణ్య స్నానాలు, గోదావరి ఫెర్రీ నుంచి ఆలయానికి వెళుతున్న భక్తులు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 8: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలు శివ నామ స్మరణతో హోరెత్తాయి. శుక్రవారం తెల్లవారు జాము నుంచి ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. నగరంలోని శివాలయాల్లో స్వామివారికి అభిషేకాలు, బిల్వార్చనలు చేశారు. మహాశివరాత్రి రోజునే మాస శివరాత్రి కూడా కలిసి రావడం వలన భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. సత్యనారాయణపేట గంగా పార్వతీ సమేత రేవులింగేశ్వరస్వామికి బడేటి చంటి, తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. పవరుపేట కాశీ విశ్వేశ్వరస్వామికి నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు పూజలు చేశారు. శివనగర్ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, అంబికేశ్వరస్వామికి అంబికా కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం కావడంతో అమ్మవారి సన్నిధిలో మహిళలు కుంకుమార్చన చేశారు. దక్షిణపువీధి మార్కండేయస్వామి, జరాపహరేశ్వరస్వామి, అగ్రహారం నగరేశ్వరస్వామి, పాత శివాలయం, బావిశెట్టివారిపేట, నాగేశ్వరపురం శివాలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఏలూరు రూరల్: మాదేపల్లి శివాలయంలో స్వామిదర్శనం కోసం భక్తులు ఉదయం నుంచి బారులు తీరారు. సాయంత్రం ప్రత్యేక పూజలు, రాత్రి లింగోద్భవ సమయంలో శివుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. తూర్పువీధి సాయిబాబా ఆలయం నుంచి సుమారు 10వేల మంది భక్తులు ద్వారకాతిరుమల తరలివెళ్లారు.

● దెందులూరు: దక్షిణ కాశీగా పేరు పొందిన చల్లచింతలపూడి మేధా దక్షిణామూర్తి ఆలయంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. శివునికి పంచామృతాలతో అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో కోలాటం, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు,

● పోలవరం: పోలవరం ప్రాజెక్టు దిగువ కాపర్ డ్యాం సమీపంలో ప్రాచీన శివాలయం మహానందీశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా ఏకవార రుద్రాభిషేకం, లక్షపత్రి బిల్వార్చన, భస్మార్చన, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం సాయంత్రం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నట్లు నిర్వాహకులు కోటంరాజు రాంబాబు తెలిపారు.

● ఉంగుటూరు: మహా శివరాత్రి పర్వ దినం సందర్భంగా భీమేశ్వరాలయంలో శుక్రవారం నాడు తెలుగు యువత జిల్లా అధ్యక్షులు రెడ్డి సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో పుట్టపర్తి శివాలయం ప్రతిష్ఠించి పూజలు అభిషేకాలు నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు దర్శించుకున్నారు. మండలంలోని కైకరం, చేబ్రోలు, నారాయణపురం, కంసాలిగుంట, గొల్లగూడెం, బాదంపూడి, బొమ్మిడి, రాచూరు, నల్లమాడు(ఓంకారంపురం) శివాలయాలలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కైకరంలోని చిద్వేంకట రామ బ్రహ్మానంద మహర్షి వారి ప్రశాంత నిలయంలో పూజలు, కాల్వ గట్టున ఉన్న జల లింగేశ్వరాలయంలో కాల్వ గట్టున ఉన్న శివాలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. కైకరం కాల్వ గట్టున ఆరుగుళ్ల సెంటర్‌లో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబ సమేత కల్యాణం నిర్వహించారు.

● లింగపాలెం: శివాలయాల్లో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు. మండలంలోని ఆసన్నగూడెం, ధర్మాజీగూడెం గ్రామాల్లోని శివాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల్లో స్వామివారికి మొక్కులు చెల్లించిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● కామవరపుకోట: మహాశివరాత్రి, మాస శివరాత్రి, శుక్రవారం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో శివాలయాల వద్ద, అమ్మవారి ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలతో ఆరాధించారు. వీరభద్రస్వామి, లక్ష్మీ హయగ్రీవ లలితాపీఠం, ఆడమిల్లి శనీశ్వరాలయం, కంచికామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి, తడికలపూడి గంగా పార్వతీ సమేత గాంగేశ్వరస్వామి, జీలకర్రగూడెం ధర్మలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తులు అభిషేకాలు, పూజలు చేశారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తాడువాయి భద్రకాళి సమేత వీరేశ్వస్వామి క్షేత్రం భక్తసంద్రమైంది. వేకువ జాము 5 గంటల నుంచే భక్తులు స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హర హర మహాదేవా శంభో శంకర నామస్మరణతో భక్తులు తరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాసారపు నారాయణ, పాలా రామకృష్ణ, తదితరులు భక్తులకు మజ్జిగ, మంచినీటి పంపిణీ చేశారు. వేగవరం, లక్కవరం, పంగిడిగూడెంలో ఉన్న శివాలయాలను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

● చింతలపూడి: మండలంలోని శివాలయాలు భక్తులతోకిటకిటలాడాయి. తెల్లవారుజామున 4 గంటలకే ఆలయాలను తెరిచి శివలింగ దర్శనం కల్పించారు. అభిషేకాలు, అర్చనలు, పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చింతలపూడి వేగిలింగేశ్వరస్వామి ఆలయంలో మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ నెలకొంది. పలు గ్రామాల నుంచి భక్తులు కుటుంబాలతో వచ్చి దర్శించుకున్నారు. రేచర్ల, పోతునూరు, గురుభట్లగూడెం, ప్రగడవరంలలోని శివాలయాలు భక్తుల దర్శనాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నాయి. చింతలపూడిలో రాత్రి శివ పార్వతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది.

● పెదపాడు: హర హర మహాదేవ శంభో శంకర స్మరణతో శివాలయాలు హోరెత్తాయి. పెదపాడు గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవాలయంలో మహా శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. స్వామి వారికి విశేషాలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా, ఉదయం నుంచి భక్తులు విశేష సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. శివయ్య యూత్, ఆలయ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ చేశారు.

● భీమడోలు: మండలంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని భీమడోలు భీమేశ్వరాలయం, గుండుగొలను భ్రమరాంబ మల్లేశ్వరాలయం, పొలసానపల్లి రామలింగేశ్వరాలయంలో పరమ శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునుంచే భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి.

● కుక్కునూరు: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. పెదరావిగూడెంలోని ప్రముఖ శైవక్షేత్రం పార్వతి సమేత కేదారేశ్వర స్వామి, కౌడిన్యముక్తి లోని కౌండిన్యముక్తేశ్వర స్వామి, కుక్కునూరు అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలకి భక్తులు తరలివచ్చారు. సమీప గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, రుద్రాభిషేకం, పూజలు చేశారు.

కుక్కునూరు మండలంలోని దాచారం గోదావరి తీరానికి ఆవల కుమార స్వామి ఆలయానికి శివరాత్రికి వందలాది మంది తరలివెళతారు. అధికారులు భద్రత పేరుతో గోదావరిలో పడవ నిలిపివేశారు. నిబంధనలతో అడ్డుకోవడం తగదని భక్తులు మధ్యాహ్నం వరకు భక్తులు వేచి చూసి వెనుదిరిగారు.

● కొయ్యలగూడెం: మహా శివరాత్రి పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అంకాలగూడెం, బయ్యన్నగూడెం, కన్నాపురం, యర్రంపేట శివాలయాల్లో భక్తులు శుక్రవారం తెల్లవారుజాము నుంచే అభిషేకాలు చేయించుకున్నారు. ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాటు చేసింది. భక్తుల సౌకర్యార్థం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

● జీలుగుమిల్లి : మహా శివరాత్రి పురస్కరించుకుని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. జీలుగుమిల్లిలో నూతనంగా నిర్మించే శివాలయం వద్ద సామూహిక శివలింగార్చన చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాలు, శివపార్వతుల ఉత్సవ మూర్తుల ఊరేగింపు వెంట బృందావన భజన మండలి కోలాట ప్రదర్శనలు జరిగాయి. కామయ్యపాలెం, లక్ష్మీపురం, అభయాంజనేయస్వామి సుబ్రమణ్యస్వామి, సాయిబాబా ఆలయాల్లో పర్వదినం పురస్కరించుకుని శివార్చనలు చేశారు.


మల్లాయిగూడెంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న రోషన్‌కుమార్

తెలుగుదేశం వస్తేనే సంక్షేమం, అభివృద్ధి : రోషన్

చింతలపూడి, మార్చి 8: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం వస్తేనే సంక్షేమం, అభివృద్ధి జరుగుతాయని రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి మండలం మల్లాయిగూడెంలో శుక్రవారం ఆయన ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆముదాలచిలక, అగ్రహారం, దళితపేట, మల్లాయిగూడెం గ్రామాల్లో రాత్రి వరకు ఇంటింటా ప్రచారం చేశారు. గ్రామంలో వృద్ధురాలితో మాట్లాడుతూ సూపర్-6 పథకాలపై వివరించారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి, మాటూరి వెంకట్రామయ్య, చీకటి రమేష్, మురళీ, పెదబాబు, మట్టా సత్యనారాయణ, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పాలనతో విసిగిపోయి టీడీపీలోకి..


పార్టీలోకి ఆహ్వానిస్తున్న బడేటి చంటి

ఏలూరు టూటౌన్, మార్చి 8: జగన్ పాలనతో విసిగిపోయి టీడీపీలోకి వలస వస్తున్నారని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. పవర్‌పేట టీడీపీ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ గవ్వా నారాయణరావు, నీరుకొండ వెంకటేశ్, కె.నారాయణమూర్తి, ఎస్.ఏసుకుమార్, పల్లా గౌతమ్‌కుమార్, మాకాని సురేష్ తమ అనుచరులతో టీడీపీలోకి చేరారు. చంటి మాట్లాడుతూ జగన్ ఐదేళ్లలో రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లాడన్నారు. అమరావతితో పాటు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాడన్నారు. మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని వల్లకాడుగా మార్చుతాడన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు.

టీడీపీ పాలనలో మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేశామని టీడీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చంటి అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని బడేటి క్యాంపు కార్యాలయంలో టీడీపీ మహిళా కార్పొరేటర్లు నాయుడు పృధ్వీశారధ, తంగిరాల అరుణ, వందనాల దుర్గాభవానీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయుడు సోము, సురేష్, శ్రీనివాస్, త్రిపుర సుందరి, చవ్వా అరుణకుమారి, సత్య కడియాల విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన పార్టీలతో మహిళాభివృద్ధి


మాట్లాడుతున్న కార్యదర్శి మేఘలాదేవి

కొయ్యలగూడెం, మార్చి 8: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన పార్టీని గెలిపించుకోవాలని రాష్ట్ర తెలుగు మహిళ ఆర్గనైజింగ్ కార్యదర్శి మేఘలాదేవి అన్నారు. కొయ్యలగూడెంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళా సాధికారత దిశగా ఈ రెండు పార్టీలు ముందుకు వెళుతున్నాయన్నారు. మహిళల సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలను ప్రకటించారని ఆ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఎంతో మంది మహిళలు ఆర్థిక స్తోమత లేక ఇంటికే పరిమితం అవుతున్నారని అటువంటి మహిళలందరికి ప్రవేశపెట్టే కొత్తపథకాలు ఎంతో దోహదపడతాయన్నారు. మహిళా అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తున్న టీడీపీ జనసేన కూటమికి మహిళంతా మద్దతు పలకాలని కోరారు. దుర్గాదేవి, రమా, మంగతాయారు, లక్ష్మీ, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

గన్నికి టికెట్ విషయంలో అధిష్ఠానం పునరాలోచించాలి

ఉంగుటూరు, మార్చి 8: ఉంగుటూరు నియోజకవర్గ సీటును తెలుగుదేశం అభ్యర్థి గన్ని వీరాంజనేయులుకు కేటాయించే విషయమై అధిష్ఠానం పునరాలోచించాలని, మరోపక్క పొత్తు ధర్మం పాటించాలని టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నేకూరి ఆశీర్వాదం కోరారు. నారాయణపురం నుంచి కుంచనపల్లి ఇమ్మానియేలు స్వస్థత శాలకు శుక్రవారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో గంటా యువరాజు, దిడ్ల శ్రీను, కరుటూరి జోగారావు, రతన్‌రాజు, ఏపూరి రత్నాకర్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై జగన్‌కు చిత్తశుద్ధి లేదు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు టూటౌన్, మార్చి 8: సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడంపై జగన్‌కు చిత్తశుద్ధి లేదని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నరసింహ, కె.శ్రీనివాస్ ఆరోపించారు. అన్నేభవన్‌లో శుక్రవారం రైతు సంఘ సమావేశం నిర్వహించారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం ముందుకు సాగడం లేదన్నారు. ఎర్రకాల్వ జలాశయం, కొవ్వాడ జలాశయం, తాడిపూడి ఎత్తిపోతలతో సాగునీటి ప్రాజెక్టులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాల్వలను ఆధునీకరించే చర్యలు చేపట్టడం లేదన్నారు. కె.భాస్కరరావు, కే.అప్పారావు, శ్రీరామచంద్రమూర్తి, గంటా అప్పారావు పాల్గొన్నారు.




జీలకర్రగూడెం దివాణం వద్ద మహిళకు లయన్స్‌క్లబ్ సత్కారం, పెదవేగిలో ఉపాధ్యాయినులు, జంగారెడ్డిగూడెంలో మహిళలకు సత్కారం

మహిళలకు సత్కారం

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కామవరపుకోట, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళలను సత్కరించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. గుంటుపల్లి గ్రామ కార్యదర్శి బి.రత్నకుమారిని లయన్స్ జోనల్ చైర్‌పర్సన్ ఆర్.ఆర్.రత్నకుమారి, రంగరాజు సత్కరించారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా 35 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 30 మందికి స్టూల్స్ అందజేశారు. లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ ఆర్.ఆర్.రత్నకుమారి, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ ఆర్ ఆర్.రంగరాజు, లయన్స్ క్లబ్ నాయకులు బాలవర్ధిరాజు, రేగుంట కామేష్, కె.వెంకటరామరాజు, మహేశ్వరి, ఎల్ఎస్.శర్మ, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు ఎడ్యుకేషన్: పడమర వీధిలోని లిటిల్‌బడ్స్ స్కూలులో శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు బి.ప్రగతి, కె.ధరణి, దమయంతి, పాపమ్మలను సత్కరించారు. ప్రిన్సిపాల్ విజయ, టీచర్లు భారతి, రాజేశ్వరి, జ్యోతి, బిందు, విష్ణు, ప్రసాద్ పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: వైఎంహెచ్ఏ ప్రాంగణంలో ఏవీఆర్ విజ్ఞానకేంద్రం, హేలాపురి బాలోత్సవం సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించాయి. 55 మంది మహిళలకు అభినందన సత్కారం నిర్వహించారు. విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం సభ్యురాలు కె.స్వరూపరాణి మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం సమాజం దీక్ష పూనాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనన్నారు. వివిధ సేవా సంస్థలు, ఆయా సంఘాల వారిని ఎంపికచేసి సత్కరించారు. టి.ఆంజనేయులు, వి.సు రేష్, ఉష, నళిని, రామ్‌కుమార్, గణేశ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, గుడిపాటి నరసింహారావు, శ్రీహరికోటి తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందింతే కుటుంబంతో పాటు సమాజం కూడా అన్ని రంగాల్లో ముందుకు నడుస్తుందని ఏలూరు కథోలిక పీఠాధిపతి బిషప్ జయరావు పొలిమేర అన్నారు. సోషల్ సర్వీస్ సెంటర్‌లో ఫాదర్ తాతపూడి ఇమ్మానియేలు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ ప్రసాద్, మహిళా కమిషన్ కార్యదర్శి ఫాదర్ జి.పీటర్‌ప్రసాద్, ఐ.జ్ఞేవీయర్, సెంట్‌థెరిస్సా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని బహుజన్ ఆఫీసర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు అన్నారు. ఫెడరేషన్ కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. వివిధ రంగాల్లో సేవలందించిన ఫాతిమా, నెరుసు నాగమణి, ఉషారాణి, విజయ, పుష్పలత, కె.సునీత, విజయలక్ష్మిని సన్మానించారు. సంఘ సేవకులు నేతర అజయ్‌బాబు, విటల్‌కుమార్, అంబేడ్కర్ పూలే, రత్నబాబు పాల్గొన్నారు.

● పెదపాడు: వట్లూరులోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సభ్యుల ఆధ్వర్యంలో మహిళలకు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. పీహెచ్‌డీ అవార్డు గ్రహీతలైన మహిళా అధ్యాపకులను సన్మానించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

● పెదవేగి: సమాజ ప్రగతిలో మహిళల పాత్ర ఎనలేనిదని ఎంపీపీ తాతా రమ్య అన్నారు. మండలంలోని 50మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఎంఈవో సీహెచ్.బుధవాస్, హెచ్ఎం సురేష్ కుమార్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుభాషిణి, ముస్తాఫా అలీ, రవికుమార్, టి.ఎడ్వర్డు, వి.వెంకట రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: టీడీపీ, జనసేన ప్రవేశపెట్టిన కలలకు రెక్కలు పథకం మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని సొంగ రోషన్ అన్నారు. టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కరుటూరి రమాదేవి, పగడం సౌభాగ్యవతి, గుళ్ళపూడి శ్రీదేవి, బొబ్బర రాజ్ పాల్ కుమార్, తూటి కుంట రాము, చెరుకూరి శ్రీధర్, నంబూరి రామచంద్రరాజు, రాజాన సత్యనారాయణ, చిత్తోజు తాతాజీ, గోపిశెట్టి శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

● కుక్కునూరు: బొరపటినగర్‌లో ఏపీ మహిళా సమాఖ్య మండల అధ్యకురాలు వరలక్ష్మి మాట్లాడుతూ అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు పురోగమిస్తున్నా మహిళలపై వివక్ష కొనసాగుతుందన్నారు. మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేయడం లేదన్నారు. ఎం.వెంకటాచారి, సోడే వెంకమ్మ, గాడిద వెంకటరమణ, పాయం చిట్టెమ్మ, సోడే నరసమ్మ, కవిత ,సునీత తదితరులు పాల్గొన్నారు.



ఉంగుటూరు జనసేన కార్యాలయంలో మహిళా దినోత్సవం

ఉంగుటూరు: సమాజంలో సగ భాగం ఉన్న మహిళలు రానున్న రోజులలో అన్నింటా ఉన్నత స్థానాలకు ఎదగాలని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు ఆకాంక్షించారు. ఉంగుటూరు జనసేన కార్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది పేద మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీర మహిళలు చిట్టూరి పార్వతి, నిమ్మల మౌనిక, అంబటి మాధవి, లీల మద్దాల విజయలక్ష్మి భీమన దుర్గా పల్లవి తదితరులు పాల్గొన్నారు.




బలివే భక్తులకు తపనా చౌదరి అన్న ప్రసాదం, ద్వారకా తిరుమల, పట్టిసీమ క్షేత్రాలలో భక్తులకు అన్న ప్రసాదాల పంపిణీ

ఆలయాల వద్ద భక్తులకు దాతల భోజన ఏర్పాట్లు

ఏలూరు రూరల్ / టూటౌన్: మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు పలువురు దాతలు భోజన వసతి ఏర్పాటు చేశారు. తపనా చౌదరి ఆధ్వర్యంలో విజయరాయి, బలివే, పట్టిసీమ, తాడువాయి, భోగేశ్వరం, శైవక్షేత్రాల వద్ద భక్తులకు పెద్దఎత్తున ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రసాద వితరణల ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. విజయరాయిలో చౌదరి ఆధ్వర్యంలో కోలాట నృత్యాలను ఏర్పాటు చేశారు. భక్తులకు ప్రసాదంతో పాటు మజ్జిగ, మంచినీరు అందజేశామన్నారు. పోడూరి లక్ష్మీనారాయణ, చౌటపల్లి విక్రమ్ కిషోర్, నడపన ధాన భాస్కర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బలివే రామస్వామి ఆలయానికి భక్తులకు చింతలపూడి రోడ్డులోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ప్రాంగణం వద్ద స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు 15 వేల మజ్జిగ ప్యాకెట్లు, పులిహోర పంపిణీ చేశారు. రైల్వేబోర్డు సభ్యులు వంటిపల్లి వెంకటేశ్వరరావు, చలువాది యానాదిశెట్టి శ్రీకాంత్, ఇందుకూరి వెంకట సత్యనారాయణరాజు, కాంద్రేగుల బాలశ్రీరామ్, వెల్ది శ్రీనివాస్, వెచ్చా చిన్నికృష్ణ, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులోని లింగిశెట్టి హెల్పింగ్‌హ్యాండ్స్ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ద్వారకాతిరుమలవెళ్ళే భక్తులకు లింగిశెట్టి శశికుమార్, సత్యవాణి దంపతులు అల్పాహారం, పండ్లు, దాహార్తిని తీర్చటానికి మజ్జిగ, రస్నా, చల్లటి వాటర్ ప్యాకెట్లు, బిస్కెట్లు, మందుల పంపిణీ చేపట్టారు. ఏలూరు తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడేటి చంటి పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

● పెదవేగి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బలివే రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులకు పలువురు ప్రసాద వితరణ చేశారు. తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో గారపాటి సీతారామాంజనేయ చౌదరి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రసాద వితరణ చేశారు.

● పోలవరం: పట్టిసీమ శివరాత్రి ఉత్సవాలలో గోదావరి నదికి ఇరువైపులా పలువురు దాతలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు మజ్జిగ, మంచి నీటి ప్యాకెట్లు అందజేశారు.

● పెదవేగి: భక్తులకు పలువురు దాతలు, పులిహోర, మజ్జిగను అందించారు. వంటిపల్లి వెంకటేశ్వరరావు, యానాదిశెట్టి శ్రీకాంత్, ఇందుకూరి వెంకట సత్యనారాయణరాజు, వెచ్చ చిట్టికృష్ణ, కాంద్రేగుల బాల శ్రీరామ్, వెలిది శ్రీనివాస్, కొనకల్లు వెంకటేశ్వరరావు తదితరులు పులిహోర, మజ్జిగ అందించారు. విజయరాయికి చెందిన చిన్నారులు దాచుకున్న సొమ్ముతో 500 మందికి పులిహోర, మజ్జిగ, మంచినీరు అందించారు.

అణచివేతకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలి


పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

బుట్టాయగూడెం, మార్చి 8: మహిళలపై మనువాద అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వెట్టి భారతి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం బుట్టాయగూడెంలో పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్పంచ్ కారం లక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో వెట్టి భారతి, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్ముల సురేష్ మాట్లాడారు. మహిళలకు పురుషులతో సమానత్వం లేదన్నారు. మహిళలు, బాలికలపై గృహ హింసలు, పనిప్రదేశాల్లో వేధింపులు, అత్యాచారాలు, హత్యలు అధికమైనట్లు తెలిపారు. స్త్రీలకు స్వేచ్ఛ కావాలన్నా, శ్రమ దోపిడికి గురికాకుండా ఉండాలన్నా పోరాటాలే మార్గమని పిలుపు నిచ్చారు. సభలో నాయకులు కెవి రమణ, కారం రాఘవ, తగరం బాబురావు, ధర్ముల లక్ష్మీ, శ్రావణి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. తూర్పు రేగులకుంటలో పీవోడబ్ల్యు నాయకురాలు పూనెం పార్వతి, ఏఐకేఎంఎస్ నాయకుడు తలారి ప్రకాష్ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఖండించారు. మడివి దుర్గ, చోడెం ముక్కమ్మ, చోడెం నరసమ్మ, కలింపూడి సుందర్రావు, సముద్రాల బాలసుందరం, బోడ ఏసుపాదం, తెల్లం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా ఏలూరు మార్కెట్‌యార్డు కార్మిక సంఘం కార్యాలయంలో సభ నిర్వహించారు. పీవోడబ్ల్యూ రాష్ట్రసహాయ కార్యదర్శి పి.పద్మ మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం మహిళా హక్కులను కాలరాస్తూ అనేక చట్టాలను చేస్తున్నారన్నారు. మహిళల పనిప్రదేశాల్లో, భద్రత కరువైందని, కనీస సౌకర్యాలు కల్పించటంలో మోదీ సర్కార్ విఫలమైందన్నారు. బద్దా వెంకట్రావు, వై.శ్రీనివాసరావు, బి.పద్మ, కొండమ్మ, సుజాత, రంగమ్మ, గంగమ్మ, రాములమ్మ, కుమారి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నప్పటికి పాలకులు చర్యలు తీసుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి రవి విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో రవి మాట్లాడారు. మహిళలు అణచివేతకు గురవుతున్నారన్నారు. మహిళలకు రక్షణ కల్పించి అత్యాచారాలు అరికట్టినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం అన్నారు.

శ్రీవారి క్షేత్రానికి భక్తుల పాదయాత్ర


పాదయాత్రగా వెళుతున్న భక్తులు

ద్వారకా తిరుమల, మార్చి 8: ఏలూరు షిరిడీ సాయి మందిరం నుంచి పదివేల మందికి పైబడి భక్తులు శుక్రవారం పాదయాత్రగా చిన వెంకన్న క్షేత్రానికి చేరుకున్నారు. ఏటా మహా శివరాత్రి పర్వదినాన షిరిడీ సాయి మందిరం వద్ద నుంచి తెల్లవారుజామున నాలుగు గంటలకు యాత్ర ప్రారంభించారు. సాయంత్రం మరికొందరు సాయి రథంతో స్వామివారి ఆలయానికి చేరుకున్నారు. రథాన్ని శ్రీవారి పాదుకామండపం వద్ద ఉంచి విశేష పూజలు జరుపుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముగిసిన సాయి మందిరం వార్షికోత్సవం

ఏలూరు రూరల్, మార్చి 8: దొండపాడులోని షిరిడీ సాయిబాబా మందిరం వార్షికోత్సవం శుక్రవారం ముగిసింది. స్వామివారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారాలు, అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం ముగింపు సందర్భంగా సాయినాథుడికి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నసమారాధన నిర్వహించారు.

కౌలు రైతుల సమస్యలు మేనిఫెస్టోలో పెట్టాలి

పెదపాడు, మార్చి 8: కౌలు రైతుల సమస్యలను అన్ని రాజకీయపక్షాలు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ డిమాండ్ చేశారు. పెదపాడులో శుక్రవారం కౌలురైతు సంఘాల మేనిఫెస్టో విడుదల చేశారు. రాయంకుల లక్ష్మణరావు, గున్నం వెంకట్రావు, పెద్దసంఖ్యలో రైతులు, కౌలురైతులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

కుక్కునూరు, మార్చి 8: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఓటు హక్కుపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. కేజీబీవీ కాలేజీలో ఇంటర్ విద్యార్థులను ఉద్దేశించి ఎస్ఓ పి.సుశీల మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కు ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడవచ్చన్నారు. యువత ఓటు సక్రమమైన మార్గంలో ఉపయోగించి సమాజాన్ని కాపాడాలని, దేశ భవిష్యత్తు ఓటర్ చేతుల్లో ఉందన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రాజులు, వలంటీర్లు పి.దీపిక, కె.కృత్తిక పాల్గొన్నారు.


బలివేలో భక్తుల పుణ్యస్నానాలు



అటపాక కనకలింగేశ్వరస్వామి ఆలయంలో వీరభద్ర పళ్ళెం ఊరేగింపు.. స్వామివారి కల్యాణం


మల్లయ్యగట్టును మోకాళ్లతో భక్తురాలు


చాట్రాయిలో ఏక బిల్వ మొక్క సమర్పిస్తున్న చిన్నం

మహాదేవ శంభో...

▸ మహా శివరాత్రి సందర్భంగా భక్తులతో పోటెత్తిన ఆలయాలు ▸ జనసంద్రంగా మారిన బలివే


శోభనాపురం గ్రామోత్సవంలో జ్యోతుల హారతి..




నూజివీడులో దుర్గా మల్లేశ్వరుడు.. ప్రత్యేక అలంకరణలో బలివే రామలింగేశ్వరస్వామి.. శోభనాపురం గ్రామోత్సవంలో స్వామి, అమ్మవారు

ముసునూరు, మార్చి 8: హరహర మహాదేవ శంభో శంకరా... నామస్మరణతో బలివే రామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు పరిసరాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రామలింగేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాతోపాటు రాజమండ్రి, గుంటూరు, తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం, కొత్తగూడెం తదితర జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. తమ్మిలేరులో ఏర్పాటు చేసిన జల్లు స్నాన ఘాట్‌లలో పుణ్యస్నానాలాచరించి, తమ పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటలకు స్వామివారికి మహా రుద్రాభిషేకం నిర్వహించి 3 గంటల నుంచి సర్వదర్శనానికి అనుతించగా భక్తులు పోటెత్తడంతో క్యూలైన్‌లు కిక్కిరిశాయి. బాహ్య శివలింగం వద్ద పండితులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి, నాగేంద్రస్వామి పుట్టకు భక్తులు పూజలు చేశారు. స్వామివారి దర్శనానికి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఈ ఉత్సవాల్లో అక్రమ మద్యం విక్రయాలు, పందిమాంసం విక్రయాలు జోరుగా సాగాయి. నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య సీఐ కె.రామకృష్ణ, ఎస్‌ఐ పి.వాసు ఆధ్వర్యంలో పోలీసులు, ఎన్‌సీసీ, ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది భక్తులకు వైద్యసేవలందించారు. నూజివీడు ఆర్డీవో భవానీ శంకరి, తహసీల్దార్ జవహర్ బాజీ, ఎంపీడీవో సీహెచ్. పద్మావతిదేవి, ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు. రాత్రి 11.30 నిమిషాలకు స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఈవో తెలిపారు. మండలంలోని గోపవరం, చెక్కపల్లి, చింతలవల్లి, గుడిపాడు, రమణక్కపేట తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బలివే రామలింగేశ్వరస్వామిని పెనమలూరు ఎమ్మెల్యే, నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌రావు, ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావ్, ఏలూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, జిల్లా ఏఎస్పీ కె.స్వరూప రాణి, నూజివీడు స్పెషల్ కోర్టు మేజిస్ట్రేట్ కృష్ణమూర్తి, నూజివీడు అదనపు సివిల్ న్యాయాధికారి శైలజ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. వీఐపీల తాకిడితో సామాన్య భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఉమా రామలింగేశ్వరుడికి భక్తుల తాకిడి..

చాట్రాయి: మహాశివరాత్రి సందర్భంగా చాట్రాయి ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. చుట్టుపక్కల మండలాలు, సరిహద్దున తెలంగాణ గ్రామాల నుండి భారీగా భక్తులు తరలివచ్చి పెద్దచెరువులో పుణ్య స్నానాలాచరించి పితృతర్పణలు సమర్పించి శివుడికి అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బర్మా ఫణిబాబు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, మాజీ ఎంపీపీలు దేశిరెడ్డి హైమవతి, కందుల కృష్ణ, ఎంపీడీవో మంగాకుమారి తదితరులు స్వామివారికి పూజలు నిర్వహించారు. ఏకబిల్వం మొక్కను మాజీ ఎమ్మెల్యే చిన్నం స్వామివారికి సమర్పించారు. భక్తులకు తాగునీరు, పులిహోర ప్రసాదం పంపిణీ అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్థానిక పోలీసులు, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది, స్వచ్ఛంద కార్యకర్తలు సేవలు అందించారు. మండలంలోని పోలవరం, తుమ్మగూడెం, సి. గుడిపాడు, జనార్ధనవరం శివాలయాల్లో భక్తులు స్వామివారికి దర్శించుకుని పూజలు చేశారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి శోభనగిరిపై ఉన్న దుర్గామల్లేశ్వరస్వామికి ఉదయం అభిషేకాలు జరిగాయి. సూరవరం, ముక్తేశ్వరస్వామి ఆలయంలో, కనసానపల్లి చంద్రమౌళీశ్వరుడి ఆలయాల్లో అభిషేకాలు, కల్యాణాలు జరిగాయి. శోభనాపురంలో లింగేశ్వర స్వామి కల్యాణం, గ్రామోత్సవం, జ్యోతుల ఊరేగింపు కనుల పండువగా జరిగాయి.

మల్లయ్యగట్టును మోకాళ్లపై ఎక్కుతూ..

నూజివీడు టౌన్: నూజివీడు మండలం దిగవల్లి శివారు మల్లయ్యగట్టుకు భక్తులు బారులు తీరారు. ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం తదితర ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. పలువురు మెట్ల మార్గం గుండా మెట్లపూజ చేసుకుంటూ మోకాళ్ళపై సుమారు 1100 మెట్లను భక్తులు అధిరోహించి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నూజి వీడు పట్టణంలోని దుర్గామల్లేశ్వర ఆలయం, కోట శివాలయం, కోట మహిషమ్మ ఆలయాలతో పాటు అన్నవరం, వల్లీదేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

వైభవంగా పాతాళ భోగేశ్వరుడి కళ్యాణం

కలిదిండి: కలిదిండిలో దక్షిణ కాశీగా పేరొందిన పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణం ఆలయ చైర్మన్ గంగాధర శర్మ దంపతులు వైభవంగా నిర్వహించా రు. భక్తులు తెల్లవారుజాము నుంచే పంచబుగ్గల కోనేరులో పుణ్యస్నానాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే డీఎన్నార్ దంపతులు స్వామి, అమ్మ వార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు విచ్చేయటంతో ఆలయ ఆవరణ కిక్కిరిసింది. మహిళలు, చిన్నారుల కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. నాగన్న చెరువు, అంజనాపురం, లోడిదలంక, పడమటిపాలెం గ్రామాల నుంచి ట్రాక్టర్లపై ప్రభలను ఊరేగింపుగా డప్పు వాయిద్యాలతో బాణాసంచా కాల్చుతూ ఆలయానికి తరలించారు. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కైకలూరు సీఐ కృష్ణకుమార్ పర్యవేక్షణలో ఎస్‌ఐ ప్రియకుమార్ బందోబస్తును నిర్వహించారు.




కలిదిండి భోగేశ్వరస్వామికి ఎమ్మెల్యే డీఎన్నార్ పట్టువస్త్రాలు.. క్యూలైన్లో కామినేని.. స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కాగా భోగేశ్వరస్వామివారిని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ ఉచిత దర్శనం క్యూ లైన్‌లో రెండు గంటల పాటు నిలబడి దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ జయమంగళ, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి ఆలయ ఆవరణలోని తపస్సు చెరువులో తెప్పోత్సవం జరిగింది. హంసవాహనంపై స్వామి, అమ్మవార్లు జలవిహారం చేశారు. భారీ బాణాసంచా కాల్పులు జరిగాయి. ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, కలిదిండి సర్పంచ్ మారుతీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అటపాకలో వీరభద్రపళ్లెం ఊరేగింపు..

కైకలూరు: ఉదయం నుంచి శైవాలయాల్లో మహాశివుడికి అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో కొలువైఉన్న రామలింగేశ్వర, రామేశ్వరస్వామివార్లకు అర్చకులు విశేషపూజలను నిర్వహించా రు. స్థానిక ఏలూరు రోడ్డులోని శివాలయంలో, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కొలువైయున్న నగరేశ్వరస్వామివారికి విశేష అభిషేకాలను చేశారు. అటపాకలో సర్వమంగళ పార్వతీ సమేత కనకలింగేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. గురువారం రాత్రి గ్రామంలో వీరభద్ర పళ్ళెం ఊరేగింపు జరిగింది. శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణోత్స వాన్ని కన్నులపండువగా జరిపారు. భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు బందా సత్యనా రాయణ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో వీఎన్‌కె శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లును నిర్వహించారు. ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి.

ముదినేపల్లి: పెదగొన్నూరులోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకుడు లంక వెంకటేశ్వర బాబు స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు కల్యాణం తిలకించారు. అనంతరం ఆలయంలోని జమ్మి చెట్టు వద్ద భక్తులు పూజలు జరిపారు. అల్లూరులో సోమేశ్వరస్వామికి పూజలను అర్చకుడు అయిలూరి సుబ్బరాయ శర్మ నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు.

చింతలపూడిపై మాట తప్పిన జగన్: జనసేన

చాట్రాయి, మార్చి 8: కొద్ది నెలల క్రితం నూజివీడు వచ్చిన సీఎం జగన్ చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ విమర్శించారు. శుక్రవారం ఆయన జనసేన, టీడీపీ నాయకులతో కలసి చీపురుగూడెంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం అక్విడెక్ట్‌ను పరిశీలించి మాట్లాడుతూ టీడీపీ హయాంలో 70 శాతం పనులు పూర్తయిన ఈ పథకాన్ని జగన్ అధికారంలోకి రాగానే నిలిపివేసి రైతాంగానికి తీరని ద్రోహం చేశాడని ధ్వజమెత్తారు. ఈ పథకం ఉపయోగంలోకి వస్తే ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలో 5 లక్షల ఎకరాల మెట్ట భూములు గోదావరి జలాలతో సస్యశ్యామలం కావటమే కాక కొన్ని వందల గ్రామాలకు తాగునీటి సమస్య తీరేదన్నారు. నూజివీడు నియోజకవర్గ టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథిని గెలిపించుకుంటే త్వరితగతిన చింతలపూడి పథకం పూర్తి అవుతుందన్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన అంతమై టీడీపీ జనసేన ప్రభుత్వం ఏర్పడబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట టీడీపీ జనసేన నాయకులు చీకటి చెన్నారావు, మండలపు జగదీష్, యర్రంశెట్టి రాము, షేక్ నాగూర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

శిలువ యాత్రలో పాల్గొన్న కామినేని



కైకలూరు, మార్చి 8: కైకలూరు ఆర్సీఎం చర్చి నుంచి కలిదిండి మేరీమాత ఆలయం వరకు శిలువ యాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఉదయం కైకలూరు నుంచి ప్రారంభమైన శిలువయాత్రకు సువార్తీకులు స్వాగతం పలికారు. ఈ యాత్రలో మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పాల్గొని శిలువ మోశారు. టీడీపీ నేతలు పూల రామచంద్రరావు, వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, టీకేఎం నాని, పళ్లెం తాతారావు, బోడావుల ఎలిషారాజు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి ఝాన్సీరాణిని సన్మానిస్తున్న కొలుసు.. పోలవరంలో మహిళలకు సన్మానం..

ఘనంగా మహిళా దినోత్సవం

నూజివీడు, మార్చి 8: తెలుగుదేశం పార్టీతోనే మహిళల అభివృద్ధి సాధ్యమని నూజివీడు నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నూజివీడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నూజివీడు పట్టణంలో పలు రంగాల్లోని మహిళలను ఆయన సత్కరించారు. నూజివీడు టీడీపీ నాయకురాలు, మున్సిపల్ మాజీ చైర్మన్ బొబ్బిలి ఝాన్సీరాణితో పాటు టీడీపీ సీనియర్ మహిళా నాయకులు రాధాకుమారి, గౌరీశ్వరి, నాగమణి, రాణిసింగ్, పద్మప్రియ, జయలక్ష్మి, వరలక్ష్మి తదితరులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపక అధినేత ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు ఆస్తిలో సమాన హక్కు ఇవ్వడంతో పాటు వారి అభివృద్ధికి అనేక పథకాలను ప్రవేశపెట్టిన విషయాన్ని మరువకూడదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మహాశక్తి పథకం ద్వారా మహిళలకు అనేక పథకాలను అమలుపరిచేందుకు చంద్రబాబు మినీ మేనిఫెస్టోలో నిర్ణయం తీసుకున్నారన్నారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల పాత్ర ఎనలేనిది..

భారతీయ సమాజంలో మహిళలది ప్రధానపాత్ర అని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వర రావు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నూజివీడులోని తన కార్యాలయంలో నియోజక వర్గంలోని పలువురు బడుగు, బలహీనవర్గాలకు చెందిన మహిళలకు ఆయన సత్కరించి చీరలను బహూకరించారు. శీలం పద్మ, జొన్నలగడ్డ శివలక్ష్మి, బాణావతు నాగమణి, బూర్ల నాగపద్మ, అన్నే విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు ముద్దరబోయిన సత్కారం

చాట్రాయి: మండలంలోని పోలవరం కోనేరు రంగారావు కాలనీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలు మరియమ్మ, పిచ్చమ్మ, ఆయా పార్వతిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రముఖులు ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆర్. నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ప్రసాదరావు, శ్రీనివాసరావు, శృతి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురి మృతి

ఆచంట, మార్చి 8 : ఆచంట-మార్టేరు ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆచంట కొఠాలపర్రు వంతెన వద్ద ఎదురెదురుగా మోటారు సైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆచంట ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాలివి.. ఆచంట పంచాయతీ పరిధి గొల్లపల్లివారిచెరువుకు చెందిన రొక్కాల అభిరామ్ (22) ఆచంట పెదపేటకు చెందిన చదలవాడ ఆనంద్(22) ఇరువురూ స్నేహితు లు. వీరు తూర్పుపాలెం నుంచి మోటారుసైకిల్‌పై ఆచంట వస్తున్నారు. అదేవిధంగా పోడూరు మండలం పండితవిల్లూరు పంచాయతీ పరిధిలో లక్ష్మీచెరువు గట్టుకు చెందిన చుక్కా దుర్గారావు (29), పితాని సాయి ఇరువు రు స్నేహితులు సరదాగా ఆచంటలో జరుగుతున్న రామేశ్వరస్వామి శివరాత్రి తిరునాళ్ళు వీక్షించి గురువారం అర్ధరాత్రి ఆచంట నుంచి మోటారు సైకిల్‌పై పండితవిల్లూరు వెళుతుండగా మార్టేరు-ఆచంట కొఠాలపర్రు వంతెన వద్ద ఈ రెండు బైక్‌లు ఢీకొన్నాయి. అభిరామ్, ఆనంద్ ఘటన స్థలంలోనే మృతి చెందగా మిగిలిన ఇద్దరిని 108 వాహనంలో ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో దుర్గారావు మృతి చెందినట్టు తెలిపారు. తీవ్ర గాయాలైన పితాని సాయి పాలకొల్లు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఆచంట మండలంలో విషాదఛాయలు..

ఈ ప్రమాదంలో మృతి చెందిన రొక్కాల అభిరామ్, చదలవాడ ఆనంద్ ఇద్దరు యువకులు పనులు చేసుకుంటున్నారు. అభిరామ్, ఆనంద్ తల్లులు ఉపాధి నిమిత్తం ఇటీవల గల్ఫ్ దేశానికి వెళ్లారు. మరొకరు చుక్కా దుర్గారావు కు నాలుగేళ్ల క్రితం వివాహం కాగా మూడేళ్ల కుమార్తె ఉంది. శివరాత్రి పండుగ రోజున ఆచంటలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృత దేహాలను పాల కొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యు లకు అప్పగించారు. ఎస్‌ఐ రాజ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం స్వాధీనం.. బెల్ట్‌షాప్ నిర్వాహకుడి అరెస్ట్

నూజివీడు టౌన్, మార్చి 8: నూజివీడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో అనధికార మద్యాన్ని స్వాధీన పరుచుకుని ఒకర్ని అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ వెంకటరమణ తెలిపారు. ముసునూరు మండలం బలివే గ్రామంలో తిరునాళ్ళ సందర్భంగా అనధికారికంగా బెల్టుషాపు నిర్వహిస్తున్న నూజివీడు పట్టణం ఎన్టీఆర్ కాలనీకి చెందిన పాస్తం నాగరాజును అదుపులోకి తీసుకుని అతని నుంచి 51 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.


పాదయాత్ర ప్రారంభించిన టీడీపీ నాయకుడు కొడాలి వినోద్


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కామినేని శ్రీనివాస్

ధర్మ పోరాట పాదయాత్ర ప్రారంభం

మండవల్లి, మార్చి 8: ధర్మ పోరాట పాదయాత్ర పేరుతో టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ కొడాలి వినోద్ శుక్రవారం మండవల్లి మండలం కానుకొల్లు చెక్‌పోస్టు నుంచి పాదయాత్ర ప్రారంభించారు. కానుకొల్లు కాలనీలో శుక్రవారం మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి మహిళలకు అభివాదం చేస్తూ కొడాలి వినోద్ టీడీపీ శ్రేణులతో కలసి పాదయాత్రగా ముందుకు సాగారు. పాదయాత్రలో టీడీపీ శ్రేణులు పసుపు జెండాలతో నినా దాలు చేస్తూ కానుకొల్లు కాలనీ నుంచి పుట్లచెరువు మీదుగా గోపాలపురం, నాగభూషణపురం మీదగా ఇంగిలిపాకలంక, శ్రీరామ్‌నగర్ సమీపంలోని గులకాలమ్మ గుడి వరకు పాదయాత్ర సాగింది. ముదినేపల్లి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు వీరమల్లు నరసింహారావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చాబత్తిన విజయ్, కైకలూరు మండల టీడీపీ అధ్యక్షులు పెన్మెత్స త్రినాద్‌రాజు, ప్రధాన కార్యదర్శి పి రాధాకృష్ణ, మండవల్లి మండల ప్రధాన కార్యదర్శి పళ్లెం ఏడుకొండలు, టీడీపీ నాయకులు వీరాబత్తిన సుధ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పంతగాని సురేష్, జిల్లా తెలుగుమహిళా కార్యదర్శి కందేపి పద్మ, బొమ్మినంపాడు సర్పంచ్ దారం సుధ, దాకరం సర్పంచ్ జాస్తి రాజా, వెంకటాపురం సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు, ఎస్సార్పీ అగ్రహారం సర్పంచ్ పరసా వెంకటస్వామి, పళ్లెం వెంకటేశ్వరరావు, బొల్లెంపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన విజయమే తమ లక్ష్యమని పార్టీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ కొడాలి వినోద్ తెలిపారు. నియోజకవర్గంలో ధర్మ పోరాట పాదయాత్ర ప్రారంభం సందర్భంగా శుక్రవారం ఉదయం ఆయన ముదినేపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైసీపీ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అభివృద్ధి నిరోధక పాలన సాగించిందని విమర్శించారు. అనంతరం ముదినేపల్లి నుంచి యాత్ర ప్రారంభించగా కానుకొల్లు వరకు టీడీపీ కార్యకర్తలు ర్యాలీగా వెళ్లారు. మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, దాకరం, బొమ్మినంపాడు సర్పంచ్‌లు జాస్తి రాజా, దారం సుధ, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పంతగాని సురేష్, తెలుగు మహిళ జిల్లా కార్యదర్శి కందేపి పద్మ, బత్తుల రవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలను ప్రజలు క్షమించరు : కామినేని

మండవల్లి: అరాచకాలు సృష్టించి దౌర్జన్యాలకు పాల్పడిన నాయకులను ప్రజలు క్షమించరని, వైసీపీకి రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. మండవల్లి మండలం ఆనందపురం, నాగభూషణపురం, మోదుగుమూడి గ్రామాల్లో శుక్రవారం జరిగిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ కైకలూరు వైసీపీ నాయకులు నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంతో పాటు కైకలూరు కూడా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గ్రామాల్లో ప్రశాంతంగా ఉన్న ప్రజల మధ్య వివాదాలు సృష్టించడమే వైసీపీ లక్ష్యంగా పనిచేస్తోందని ప్రజలు వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు ముళ్లపూడి సత్తిబాబు, చాబత్తిన విజయ్, మండవల్లి క్లస్టర్ ఇన్‌చార్జి కూనపరెడ్డి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బలివేకు ప్రత్యేక బస్సులు

నూజివీడు టౌన్, మార్చి 8: ప్రసిద్ధిగాంచిన బలివే తిరునాళ్ళకు నూజివీడు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సర్వీసులను నడిపారు. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి బలివే ఉత్సవాలకు భక్తులు విశేషసంఖ్యలో హాజరవుతారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నూజివీడు ఆర్టీసీ డిపో నుంచి పలు రూట్‌ల గుండా నిరంతరాయంగా 20 సర్వీసులను నడిపినట్లు నూజివీడు ఆర్టీసీ డీఎం పవన్‌కుమార్ తెలిపారు.

బలివేలో భక్తులకు సేవా సంస్థల వితరణ


ప్రసాదం పంపిణీ చేస్తున్న తపనా చౌదరి తదితరులు

ముసునూరు, మార్చి 8: తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతా రామాంజనేయ చౌదరి దంపతులు ఫౌండేషన్ తరపున సుమారు 50 వేల మందికి పులిహోర, చక్కెర పొంగలి, దద్దోజనం ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అలాగే నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో సుమారు 30 వేల మందికి చక్రపొంగలి, పులిహోర, వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. ఆట్లూరి రమేష్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు రకాల ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఏలూరు సత్యసాయి సేవా సంస్థ సుమారు 40 వేల మందికి వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ అందజేశారు. ఏలూరు సూర్యతేజ ఎంటర్‌ప్రైజస్ యాజమాన్యం, హరినాథ్ సంయుక్తంగా భక్తులకు బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్, మజ్జిగ పంపిణీ చేశారు.

హోటళ్ళలో తనిఖీలు



నూజివీడు టౌన్, మార్చి 8: నూజివీడు పట్టణంలో డయేరియా వ్యాప్తి చెందిన నేపథ్యంలో నూజివీడు మున్సిపల్ శానిటరీ అధికారులు వివిధ హోటళ్ళు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల పై శుక్రవారం దాడులు నిర్వహించారు. కలుషిత ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల బాధితులు అస్వస్థతకు గురయ్యారంటూ వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డీఎంహెచ్‌వో జాస్తి జగన్మోహన్‌రావు పేర్కొన్న నేపథ్యంలో నూజివీడు పట్టణంలో ఈ దాడులు నిర్వహించి, నిల్వ ఉంచిన మాంసాన్ని ధ్వంసం చేశారు. మాంసాన్ని, ఇతర ఆహార పదార్థాలను నిల్వ ఉంచరాదని ఈ సందర్భంగా నూజివీడు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు హోటళ్ళ నిర్వాహకులను హెచ్చరించారు.

ఆయుర్వేద వైద్య శిబిరం



ముదినేపల్లి, మార్చి 8 : ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ముదినేపల్లి మండలం పెదగొన్నూరు గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బోసు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అన్ని వ్యాధులకు ఆయుర్వేద మందులను క్రమపద్ధతిలో వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తాయని వైద్యాధికారి తెలిపారు.

టీడీపీ పథకాల మెటీరియల్ పంపిణీ

చాట్రాయి, మార్చి 8: మండలంలోని సోమవరం, కోటపాడు, చిన్నంపేట, చాట్రాయి, ఆరుగొలనుపేట, జనార్ధనవరం, తుమ్మగూడెం, చిత్తపూరు తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన సూపర్ సిక్స్ పథకాల మెటీరియల్‌ను శుక్రవారం టీడీపీ క్లస్టర్-2 ఇన్‌చార్జి చీకటి చెన్నారావు పంపిణీ చేశారు. పోలింగ్ బూత్ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించాలని నాయకులను చెన్నారావు కోరారు.